PRAMUKHANDHRA 28th Year of Publication We carry the news and views of Telugus

28 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీ రామారావు

₹.15
జూన్ 2022

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA



# తెలుగు వాడిగా ఉండటాన్ని గర్విస్తున్నా




అమెరికా న్యూజెర్సీ లోజస్టిస్ ఎన్వీ రమణ గారి సన్మాన కార్యక్రమంలో భాగంగా 'మా తెలుగు తల్లికి మల్లె పూదండ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. తెలుగు వారు గర్వ పడే విధముగా ఒక అత్యున్నత స్థాయి ని చేరుకున్న వ్యక్తి ఎన్వీ రమణ గారు. ఈ కార్యక్రమంలో శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు మరియు భారత్ బయో టెక్ సూచిత్ర యల్ల,కృష్ణ యల్ల,మండలి బుద్ధ ప్రసాద్,ఎడిసన్ మేయర్ శ్యామ్,ఇండియన్ కౌన్సిల్ మెంబెర్ జైన్, చివుకుల ఉపేంద్ర,గుమ్మడి గోపాల కృష్ణ,భాను,మండవ సుబ్బారావు మరియు 40 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

---

అమెరికా పర్యటనలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ. న్యూజెర్సీలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాను తెలుగు ప్రజల్లో ఒకడిగా ఉండటాన్ని గర్విస్తున్నట్లు.. ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పుట్టిన ఊరు, మట్టి వాసన గుబాళింపును నెమరువేసుకోవాలని అన్నారు.

తెలుగు కమ్యూనిటీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో న్యూజెర్సీలో నిర్వహించిన "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, శివమాల దంపతులు పాల్గొన్నారు.

మా తెలుగుతల్లికి మల్లెపూలదండతో కార్యక్రమం ప్రారంభమైందని.. తెలుగుతల్లి ముద్దుబిడ్డగా ఉన్న వారిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

అమెరికాలో దాదాపు 7 లక్షల మంది తెలుగువారు ఉన్నారని.. ఎన్నో దశల్లో అనేక పరీక్షలు ఎదుర్కొని ముందుకు సాగుతున్నారన్నారు.

మాతృభూమిని సొంత మనుషులను వదులుకొని ఇక్కడ ఉంటున్నారని పేర్కొన్నారు. ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేస్తూ జీవితాన్ని గడుపుతున్నారని కొనియాడారు. మీ నిబద్ధత చూస్తుంటే తెలుగుజాతి భవిష్యత్తు సురక్షితమని విశ్వసిస్తున్నానని చెప్పారు.

తెలుగు అనేది కేవలం భాష కాదు.. జీవన విధానం, నాగరికత అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. మన భాషతో పాటు పరాయి భాషనూ గౌరవిస్తున్నామని.. మాతృభాష, మాతృమూర్తిని పూజించడం ఒక ప్రత్యేకత అని తెలిపారు. అమ్మ భాషలోని తియ్యదనం అనుభవించాల్సిందే.. మాటల్లో చెప్పలేమన్నారు. ఇంట్లో మాట్లాడేటప్పుడు తప్పనిసరిగా మాతృభాషలోనే మాట్లాడాలన్న సీజేఐ.. మన భాష, సంస్కృతి మరచిపోతే జాతి అంతరించిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలుగు భాష కోసం ఉద్యమం చేయాల్సిన దుస్థితి ఏర్పడడం బాధగా ఉందన్నారు.

మాతృభాషలో ఉద్యోగాలు రావనేది అపోహ మాత్రమేనన్న ఆయన.. తాను మాతృభాషలో చదివి ఈ స్థాయికి వచ్చాననేది మరచిపోవద్దని అన్నారు.

"జాషువా, దాశరథి, శ్రీశ్రీ వంటి మహానుభావులు వెలకట్టలేని సంపద ఇచ్చారు. తెలుగు సంస్కృతిని, కళారంగాన్ని ప్రభావితం చేసిన ఎన్టీఆర్ శతజయంతి ప్రారంభమైంది. ఎన్టీఆర్, ఘంటశాల ఉచ్ఛారణ మా తరానికి అలవడింది. ఎన్టీఆర్, ఘంటశాలకు ఈ సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నా" బి అని సీజేఐ, జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

అమెరికాలో 2010-2017 మధ్య తెలుగు మాట్లాడేవారి సంఖ్య 85 శాతం పెరిగిందని.. మాతృభూమిలో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో తోడ్పాటు అందిస్తున్నారని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు.

తెలుగువాడిగా సీజేఐ అవకాశం రావడం చాలా సంతోషాన్నిచ్చిందన్న జస్టిస్ ఎన్వీ రమణ.. తాను ఓ రైతు కుటుంబం నుంచి వచ్చానని, తమ కుటుంబంలో ఎవరూ పెద్దగా చదువుకోలేదని తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఉన్నత స్థాయికి చేరుకోవడం చాలా కష్టమన్న ఆయన.. పట్టుదలతో పాటు తల్లిదండ్రుల ఆశీర్వాదాలు ఉన్నందునే ఈ స్థాయికి వచ్చినట్లు పేర్కొన్నారు.



# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూన్ 2022

సంపుటి : 28 **330** సంచిక : 6




## త్యాగభావం కల భారతీయుల్లో రాజ్యదాహం పెరిగింది!!

పురాణ ఐతిహాసిక చరిత్రను తరిచి తరిచి చూస్తుంటే – రాజ్యాది కారాన్ని భారతీయులు ఎప్పుడూ ఆశించలేదు. సత్యం కోసం ధర్మం కోసం రాజ్యాన్ని వదులుకున్న త్యాగ భావ సంఘటనలే ఎక్కువగా కనిపిస్తాయ్.

హరిశ్చంద్రుడు సత్యం కోసం రాజ్యం, సర్వస్వమూ వదులు కున్నాడు. శ్రీరాముడు తండ్రికిచ్చిన మాట కోసం రాజ్యాన్ని విడిచి, అడవులకు వెళ్లాడు. లక్ష్మణుడు రాచపదవి నాశించకుండా అన్నతో కానలకు ఏగాడు. తిరిగి వచ్చిన తరువాత కూడా పదవి నాశించ లేదు. ధర్మరాజు సత్యధర్మాల్నే శిరసా వహిస్తూ అడవులకు వెళ్లాడు. రాక్షసరాజు బలిచక్రవర్తి శ్రీహరి కిచ్చిన మాట కోసం రాజ్యసంపద లన్నిటినీ ధారవోస్తూ

**కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిన్ బొందరే**
**వారేరీ సిరిమూటగట్టుకుని పోవంజాలరే భూమిపై**
**ఒకరైనం గలరే శిబి ప్రముఖులుంబ్రీతిన్ యశఃకాముల్తై**
**యీరే కోర్కెలు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా!**

– అన్న మాటలు భారతీయులకు శిరోధార్యములు. పోతన గారు మరో మాటను కూడా అన్నారు– ‘మహావదాన్యుడు మరియు గలడే’ అన్నారు. అలాటి రాక్షసరాజైననూ – వచ్చిన వాడు రాక్షస హంతకుడైన హరి యని నెరిగి, యిచ్చిన మాట ప్రకారం – గురువు శుక్రాచార్యుడు వారిస్తున్నప్పటికినీ సత్య వాక్యమును పాలించాడు. ప్రాణాపాయ సమయములందు ఆడిన మాటను పాటించ నవసరం లేదని చెప్పిననూ వినలేదు. అదే భారతీయ సనాతన ధర్మం, భార తీయుల సత్యపాలనం, భారత సంస్కృతి, భారత సాంప్రదాయం విశిష్ట నాగరికతా విశేషం.

భారత భూమి కేవలమూ మన్ను కాదు. ఒక సత్య విశ్వాసంతో, త్యాగధర్మంతో, న్యాయ దృష్టితో జీవన విధానము నేర్పరచుకున్న. పుణ్యభూమి. పునీత భూమి.

ఆకాశమంతటి విశాల భావం, సముద్రమంతటి లోతైన ఆలోచన, భూగోళమంతటి ధర్మదృష్టి కల దేశం. ఈ కారణంగానే ఈ పుణ్యభూమిని భరతవర్షంగా, భరత ఖండంగా అభివర్ణించారు పెద్దలు. ఇంతటి ధర్మబద్ధమయిన కర్మభూమి యెక్కడనూ కానరాదనడానికి మహా కవులు వాక్యములే నిదర్శనం

**‘ఓంకార స్వరలీనమై నిగమనాదోపాసనాధీనమై**
**కైంకర్య ప్రతిపాద్యయై భువన రక్షాదక్షయై తాండవా**
**హంకార స్థిర చంద్ర యశ్శ కల శైత్య ప్రాప్త శాంతత్వమై**
**శంకా సంకులమైన నీ యునికి ఆశాసిద్ధి కల్పించుతన్–**

అని విశ్వనాథ వారు దేవతల, పుణ్య చక్ర వర్తులు నడయాడిన పాద పవిత్ర చిహ్నా. గర్భిత ఆంధ్రభూమి అన్నారు. ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి త్యాగధనులు మెట్టిన భూమియైన పవిత్ర సీమలో ఉంటున్నందులకు గర్వించాలో, ప్రస్తుత భోగలాలసుల పాలనకు “ఆవాసమవుతున్న దేశాన్ని జూచి గర్వించాలో తెలియని అగమ్య స్థితి కలుగుతుంది. భారతీ! నీవే రక్షించు తల్లీ!



బుధజన విధేయుడు
*– గోటేటి శ్రీరామారావు*
(మార్చి 2009)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# శివార్పణ ఫలితం

తమిళనాడు దగ్గర సముద్ర తీరంలో 'నాగపట్నం' అనే ఊరు ఉన్నది. అక్కడ జాలరి కుటుంబాలు చాలా ఉన్నాయి. ఈ కుటుంబాలలో ఒక జాలరివాడు మహాశివభక్తుడు.

ఆ జాలరివాడి పేరున ఇప్పటికీ నాగపట్నంలో ఒకరోజున ఉత్సవం చేస్తారు.

ఈ జాలరి వాడికి ఒక దినచర్య – అందరూ కలిసి వెళ్ళి చేపలు పట్టేవాళ్ళు. ఈయనకి అలవాటు ఏంటంటే వచ్చిన మొదటి చేపని 'శివార్పణం!' అని సముద్రంలో వేసేవాడు. మిగిలినవన్నీ తను తీసుకునే వాడు.

ఇప్పుడు మనం దుకాణాలలో చూసినా మొదటి ఇడ్లీ భగవంతుడి దగ్గర పెట్టి మిగిలిన ఇడ్లీలు జనాలకి పెడుతూ ఉంటారు.

ఇతను భక్తిగా చేశాడు. ఇతని బ్రతుకులో తెలిసినదంతా శివార్పణం.

నిజానికి భక్తి అంటేనే శివార్పణం. శివార్పణం అని మనసారా అనగలిగితే ఆ మాట చాలు ఆనందింపజేస్తుంది. శివుడితో కలిసిన ఏ మాటకైనా అందం వస్తుంది. శివభక్తి, శివప్రేమ, శివార్పణం ఇలాంటి మాటలు. ఇతనికి తెలిసిన ఒకే పదం శివార్పణం!

అటు తర్వాత చేపలు పట్టుకొనేవాడు. ఇతడు జాలరి వాళ్ళకు నాయకుడు. నాయకుడు ఏం చెప్తే మిగిలిన వాళ్ళు అదే. ఒక కట్టు ఉండాలి. ఒక పద్ధతి ఉండాలి గనుక ఒక నాయకుడిని పెట్టుకున్నారు. ఈనాయకుడిగా ఉంటూ ఉంటే అందరూ హాయిగా ఉన్నారు. మత్స్యసంపదతో సంపదలన్నీ సంపాదించుకుంటూ హాయిగా ఉన్నారు.

ఏం దౌర్భాగ్యమో కానీ కొంతకాలం వాళ్ళకి చేపలు పడలేదు. ఎన్నాళ్ళు సముద్రంలోకి ఎంతోదూరం వెళ్ళి వేటాడుతున్నా చేపలు పడలేదు. దరిద్రం వచ్చింది. ఉన్న నిల్వలన్నీ కూడా నిత్యభోజనాలకీ, కుటుంబపోషణలకీ అయిపోయాయి.

చివరికి తిండికి కటకటలాడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. అందరికీ ఇదే పరిస్థితి. ఇళ్ళల్లో పొయ్యి వెలగట్లేదు.

ఒకసారి అందరూ గుంపుగా వెళ్ళినప్పుడు వల వేశారు. ఈ పెద్దాయన వల వేయగానే వలలో ఏదో బరువుగా పడింది. ఏమిటా అని తీసి చూస్తే ఎన్నడూ ఎవ్వరూ చూడని కనీవినీ ఎరుగని ఒక చేప వచ్చింది.

అది బంగారు రంగు పొలుసులు, రత్నాలు తాపినటువంటి చర్మంతో ఆశ్చర్యకరంగా ఉన్నది.

దానిని వీళ్ళందరూ కష్టపడి పడవ మీదకి తీసుకువచ్చారు. ఈ చేపని తీసుకువెళ్ళి రాజుగారికి ఇస్తే ఆ రాజు దీనిని ఉంచుకొని వీళ్ళకి కావలసినంత సంపద ఇస్తాడు. లేదా ఎవరికైనా అమ్ముకున్నా దీనినుంచి వచ్చేది మరి ఎప్పుడూ చేపలు పట్టుకోవలసిన అవసరం లేనంత సంపద వచ్చేది.

కానీ ఇతనికున్న అలవాటు వచ్చిన మొదటి చేపని శివార్పణం అని వేయడం.

దీనితోపాటు ఒక రెండు, మూడు చేపలు వస్తే అసలు బంగారు చేప ఉంచుకొని రెండోది పడేయచ్చు. కానీ ఈయనకి వచ్చింది ఒకటే చేప.

ఇక్కడ ఉన్న మిగిలిన వాళ్ళందరికీ భయం పట్టుకుంది. ఎందుకంటే ఈయన అలవాటు వాళ్ళందరికీ తెలుసు. మొదటిది శివార్పణం అని వేయడం అలవాటు. నాయకుడు కాబట్టి వద్దు అనలేరు. అప్పుడు ఏం చేస్తాడో అని ఆవేదన కలిగినది, వీళ్ళందరికీ. వచ్చింది శివార్పణం ఇవ్వకపోతే ఏమౌతుందో అని భయం లేదు. మిగిలిన వాళ్ళందరూ తిండికి లేదని ఏడిస్తే ఈయన రోజూ శివార్పణం చేయడానికి చేప లేదు అని ఏడ్చేవాడు.

అదీ భక్తి అంటే!

ఇతని ఏడుపులో ఆ ప్రేమ ఉంది. మిగిలిన వారికి సంపద లేదే అని బాధ. ఇప్పుడు ఇతనికి ఇన్నాళ్ళకి నాకు శివుడికి అర్పించడానికి గొప్ప చేప దొరికింది అని ఆనందం కలిగింది. ఇంతకాలం మామూలు చేప ఇచ్చాను. శివుడికి అర్పించడం కోసం అద్భుతమైన చేప దొరికింది అని ఒళ్ళంతా పులకించిపోయింది. కళ్ళవెంట ఆనందాశ్రువులు రాలుతున్నాయి.

పైకి తీశాడు ఆ చేపని. వీళ్ళకి భయం వేసి కాళ్ళు పట్టుకున్నారు పారేయకు అని!

వీళ్ళెవరూ పట్టట్లేదు అతనికి. ఆ శివుడికి అర్పిస్తున్నాను అని తీసుకొని 'శివార్పణం' అని సముద్రంలో వేశాడు.

వెంటనే ఒక్కసారిగా ఆకాశంలో మహా కాంతిపుంజం కనిపించి ఆ కాంతిపుంజ మధ్యంలో వృషభవాహనారూఢుడై పార్వతీ సమేతుడైన పరమేశ్వరుడు దర్శనమిచ్చి "సంతోషించాను!" అని ఇతనితో పాటు అందరినీ తనలో ఐక్యం చేసుకొని వాళ్ళకి దివ్యమైన మోక్షాన్ని అనుగ్రహించాడు.

'ఒక్క భక్తుడిని అంటిపెట్టుకున్నా చాలు తరించిపోతాం!' అని చెప్పడం. 'స్వయం తీర్త్వా పరాన్ తారయతి'

తాను తరించడమే కాకుండా ఎందరినో తరింపజేశాడు.

ఆ భక్తుడి పేరున ఇప్పటికీ అక్కడ ఉత్సవం జరుగుతుంది.

ఆ సమీపంలో ఉన్న శివుని ఉత్సవమూర్తియై ఇక్కడికి తెస్తారు.

ఆ జాలరి వాళ్ళ ఇంట్లో ఇప్పటికీ ఉత్సవం జరుగుతుంది.

భారతదేశం అంతా ఈ దృష్టితో వెతకాలి, తిరగాలి. భగవంతుడిని చరిత్రలో చెప్పిన సాక్ష్యాలు ఎక్కడ ఉన్నాయి అని వెతికితే ఇప్పటికీ దొరుకుతాయి.

ఇలా ఈ మహానుభావుని 'శివార్పణం' కథ చెప్పుకున్నాం. దీనిని భావించి నట్లయితే 'అర్పణ బుద్ధి' అంటే ఏమిటో తెలుస్తున్నది.

కొంతమంది భగవంతుడి దయవల్ల సంపాదించి మాటిమాటికీ అంటూ ఉంటారు భగవంతుడు ఇచ్చాడని. కానీ ఎంత ఉన్నా ఇచ్చింది ఏమౌతుందో అనే భయం వాళ్ళకి. ఒకళ్ళకి ఇవ్వడానికి, దానం చేయడానికి కూడా బుద్ధి పుట్టదు.

'అర్పణకి' సిద్ధంగా ఉన్నవాడికే అన్నీ లభిస్తాయి.

కనుక అర్పించేదే నీది, దాచుకున్నది నీదికాదు. తరువాత ఎవడిదో అవుతుంది. ఇలాంటి కథలు వింటే స్వార్థరాహిత్యము, త్యాగనిరతి, ఏర్పడి నీతి, నిజాయితీ అభివృద్ధి చెందుతాయి.

ఇలాంటి నిజ జీవిత గాథలను చిన్నప్పటినుంచీ తెలియజేసినట్లయితే పిల్లల్లో పవిత్రమైన సంస్కారాలు వస్తాయి.

భగవత్కథ వింటూ ఉంటే మనలో రజోగుణ తమోగుణాలు పోయి మంచి సంస్కారాలు మేల్కొంటాయి.

భగవంతుడు తల్లిదండ్రులకంటే ఎక్కువగా కనురెప్పలా కాపాడుతాడు అనడానికి అద్భుతమైన చరిత్రలు చాలా వున్నాయి.

ఓం నమ:శ్శివాయ:!!

# అచ్చ తెలుగు నుడికారాలతో పోతనగారి అందమైన పద్యం

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమ:

**బమ్మెరపోతన భాగవతంలోని పద్యము. (32 ) :**

ఉ॥ దానవులైననేమి? మరి దైత్య సమూహములైననేమి? నీ
మానితబాహు దుర్గముల మాటున నుండగ నేమిశంక ? నీ
తో నరుదెంతు నంచు గరతోయజముల్ ముకుళించి మ్రొక్కెన
మ్మానిని దన్ను భర్త బహుమానా పురస్సర దృష్టి జూడఁగన్.

నరకాసుర సంహారానికి శ్రీకృష్ణుడు బయలుదేరినప్పుడు, సత్యభామ తనను కూడా తీసుకువెళ్ళమని అడుగగా, శ్రీకృష్ణుడు, రణరంగం యెలావుంటుందో వర్ణించిచెప్పి, త్వరగా వచ్చేస్తాను, నీవు వుండిపో, అని అనునయించబోయాడు.

ఆ సమయంలో, సత్యభామ, శ్రీకృష్ణునితో చెప్పే పద్యం యిది.

'రాక్షసులైనా సరే! రాక్షససైన్యమైనా సరే ! నీ గొప్ప బాహువులనే కోటలమాటున వుండగా, నాకేమి భయము, అనుమానము,' అంటూ పద్మములవంటి తనచేతులు జోడించి నమస్కరిస్తున్న సత్యభామ, తనను తనభర్త మెచ్చుకోలుగా చూసి మన్నించగా చూసినది.

కారణజన్మురాలు సత్యభామ. నరకాసురుని వధించడంలో ఆమె పాత్ర యెంతో ముఖ్యమైనది. అట్టిది ఆ అమ్మలేకుండా, శౌరి రణరంగానికి, నరకాసుర సంహారానికి వెళ్ళడానికి యెలా కుదురుతుంది? అయినా శ్రీకృష్ణుడు, ఆమె మనసెరుగవలెనని, రణరంగమంటే, నీవు ఆడుకునే ఆటస్థలాలు కావనీ, తుమ్మెదల ఝుంకారాలు వినబడవనీ, అక్కడ, కాలువలు, జలపాతాలు ఉండవని, కలహంసలు నాట్యము చెయ్యవనీ, ఘోరరూప రాక్షసులు అనేక ఆయుధాలతో, పెద్ద పెద్ద వాహనాలపై వచ్చి విరుచుకుపడతారనీ, మరీ మరీ వర్ణించి చెబుతాడు.

ఆమెకూడా తన శౌర్య పరాక్రమాల గురించి యిసుమంత అయినను చెప్పక, తనభర్త భుజస్కంధాలపైనే, తనరక్షణ కూడా వున్నదని నమ్మబలుకుతూ, ' నాకేమి భయము, యెంతగొప్ప రాక్షస సమూహములున్నను ' అని చెప్పింది. ' కోటగోడల వంటి నీ భుజముల మాటున, నారక్షణకు యెట్టి లోపములేదు ' అని వినయంగా చేతులు జోడించి, తనను తీసుకువెళ్ళమని ప్రార్థించింది.

సత్యభామ యొక్క నడవడిలో యిది ఒక శ్రేష్టమైనకోణము. ఇలాంటి వినయ సాధు స్వభావము, ఆమెలో, వేరెక్కడా కనిపించదు. ఆమె యుద్ధభూమిలో నిలువ వలెనను ఆకాంక్ష, భర్తను ఆవిధంగా కోరేటట్లు చేసింది.

ఎంతటివాడైనా తన శౌర్యసాహసాల మీద అంత నమ్మకంతో మాట్లాడిన భార్యను కాదని వెళ్లగలడా ? అదే జరిగింది. ఆమె ఆవిధంగా చేతులు జోడించగానే, ఆ జోడించిన చేతులని, ఆప్యాయంగా పట్టుకుని లేవదీసి, సత్యభామను, గరుడ వాహనం పై యెక్కించుకుని ఆకాశమార్గాన బయలుదేరాడు, రణరంగానికి, శ్రీహరి.

ఇక్కడ సత్యభామ గురించి మరి కొంచెం విశ్లేషించి చూస్తే, ఆమె తన అందం తోనూ, శ్రీహరిని కట్టి పడవేసింది. పాద క్రాంతుని చేసుకున్నది. తన అమాయకమైనచూపులతో శ్రీహరిని తులాభారానికి పెట్టింది. గర్వంతో సపత్నులను అధిగమించాలని, పారిజాత వృక్షం తెప్పించుకున్నది.

ఇప్పుడు, నరకాసుర సంహారానికి వెళుతున్న సమయంలో, తన జాలిగొలుపు చేష్టలతో, భర్తను పొగుడుతూ, భర్త బాహుబలాన్ని పొగుడుతూ, తనకు కావలసినవిధంగా, మాట నెరవేర్చుకున్నది.

లీలామానుష విగ్రహుడు అన్నింటికీ కట్టుబడ్డాడు. ఎప్పటికేది తగునో, అదేవిధంగా ఆమెతో సంచరించాడు. ఆమె మురిసిపోయేటట్లు చేశాడు.

ఇంతకంటే భార్యాభర్తల అనుబంధానికి నిర్వచనం యేముంటుంది ? భార్యల విషయంలో నొప్పింపక, తానొవ్వక తిరుగువాడు శ్రీహరి. అదే మార్గదర్శకంగా నేటిభర్తలు భార్యలవద్ద నడుచుకుంటే, గృహమే కదా స్వర్గసీమ. భర్త అనేవాడు, తనకు, తనవారికి తగిన మర్యాదమన్ననలను యెప్పటికప్పుడు చూసుకుంటూ, తన అర్ధాంగి కోరికలు తీర్చేవాడైతే, భార్యకు కావలసినది యేముంటుంది ? భర్త రక్షణపై భార్యచూపే నమ్మకంవలన, భర్త కరిగిపోడూ ! ఇక్కడ అదే జరిగింది.

ఎక్కడ తగ్గివుండాలో, యెలా పనులుసాధించుకోవాలో, సున్నితంగా మధురంగా పోతనామాత్యులు నేర్పినపద్యం. గృహిణులకు అనుసరణీయం.

**బమ్మెరపోతన భాగవతంలోని పద్యము. (33) :**

సీ॥ సౌవర్ణ కంకణ ఝణఝణ నినదంబు
శింజినీరవముతో జెలిమి సేయ
దాటంక మణిగణ ధగధగ దీప్తులు
గండమండల రుచి గప్పిగొనగ
ధవళ తరాపాంగ ధళధళ రోచులు
బాణజాల ప్రభా పటలి నడప
శరఘాత ఘుమఘుమ శబ్దంబు పరిపంథి
సైనిక కలకల స్వనము నుడుప

తే. వీర శృంగార భయ రౌద్ర విస్మయములు
గలసి భామిని యయ్యనో కాక యనగ
నిషువు దొడుగుట దివుచుట యేయుటెల్ల
నెరుగరాకుండ నని సేసె నిందువదన.

నీ భుజాలమాటున దాగివుంటాను, నాకేమిభయము అని యుద్ధానికి శ్రీకృష్ణుని వెంటవెడలిన సత్యభామ, తాను యుద్ధము చేయవలెనని కోర్కెచూపగా, లేమా (ఓ లేతవయసుగలదానా!), మేము జయింప లేమా! అనుచునే, శ్రీకృష్ణుడు ఆమెకు విలాసముగా విల్లు అందించాడు. ఇక తనపరాక్రమము సత్యభామ రణరంగంలో, యేవిధంగా చూపిందో సీస పద్యంలో వర్ణింపబడినది.

అల్లెత్రాటి చప్పుళ్లతో, ఆమె బంగారుకంకణాలు ఝణ ఝణ శబ్దములు స్నేహము చేయుచుండగా, చెవిదుద్దుల యొక్క మణుల సమూహముల ధగధగ కాంతులు ఆమె చెక్కిళ్ళ మెరుపును కప్పివేయగా, అతి తెల్లననైన కడగంటి తళతళమను కాంతులు, బాణముల మెరుపులను అణచివేయగా, ఆ బాణములు పడుతున్నప్పటి ఘుమ ఘుమ శబ్దము శత్రు సేనల కలకలం యొక్క ధ్వని అణచగా, వీరము, శృంగారము, భయానకం, రౌద్రము, అద్భుతము అనే అన్ని రసములు కలిసిపోయి ఈ స్త్రీరూపము పొందేనా యేమి అని తెలియరాకుండగా, ఆచంద్రుని వంటి మోముగల సత్యభామ, బాణమును సంధించుట, లాగుట ప్రయోగించుట, శత్రువులకు తెలియరాకుండా, యుద్ధపరాక్రమము ప్రదర్శించింది.

మొదట యెంతో బేలగా అర్థించింది భర్తను, తనతో తీసుకువెళ్ళమని. తీరా యుద్ధరంగంలో తానే విల్లు ధరించింది. ఆమె విల్లు ధరించినగానీ, నరకుని కన్ను చెదరదు, ఆతని ఆయువు మూడదు. ఇన్ని విషయములు పెనవేసుకున్నందునే, చక్రి ఆమెకు విల్లు అందించాడు. స్త్రీ శక్తి యేమిటో, ఆమెద్వారా అందరికీ చూపించాడు. అబల అవసరమైతే సబల అని మగవానికి బాసటగా వుంటుందనీ లోకానికి తెలియజేశాడు.


ఈ నాటికీ, వీరనారి అంటే యెవరినైనా సత్యభామతోనే పోల్చడం సర్వ సాధారణం కదా ! కేవలము యుద్ధంలో శ్రీకృష్ణునికి సహాయం చేసింది అని చెప్పి వూరుకోకుండా పోతన గారు, ఒక సీసపద్యం ఆమె యుద్ధ కౌశలానికి వినియోగించి అక్కడ యుద్ధభూమిలోని వారినీ, యిక్కడ పాఠకులను అన్నిరసాలలో ముంచి తన్మయులను చేశారు.

ఆమెను వర్ణించిన విధానం అంతా ఒక యెత్తు అయితే, ఆమె ధనుస్సుకు బాణము తొడగుట, లాగుట, ప్రయోగించుట యేకకాలంలో చేసినదని కన్నులకు కట్టినట్లు చెప్పడం యెంతో రమణీయం.

పోతనామాత్యుడు వాడిన మాటల శబ్దతరంగాలు, మనలను కూడా యుద్ధ భూమిలో సత్యభామా యుద్ధ కౌశలం చూడమని అన్నట్లు లేదూ! ఝణ ఝణ, ధగ ధగ, ధళధళ, ఘుమ ఘుమ లు అన్యులకు వాడ సాధ్యమా, యింత కర్ణపేయంగా. అందుకనే ఆయన తెలుగువారి కాణాచి.

స్త్రీ జాతి ముఖ్యంగా తెలుగు స్త్రీలు, పోతనకు యెంతో ఋణపడి వుండాలి. ఆయన సృష్టించిన సత్యభామా పాత్రచిత్రణకు,

– ప్రభాకర్



# సందేశాత్మక హాస్యం

జంఘాల శాస్త్రి పేరు విన్నారా? పోనీ, షేక్ పీరు సాహెబు లేదా హనుమాండ్లు ఇత్యాది నామ ధేయాలైనా??... ఈ నామధేయాల సృష్టికర్త జంఘాల శాస్త్రి కాగా, సదరు శాస్త్రిని సృష్టించినదే పానుగంటి లక్ష్మీ నరసింహారావు. తెలుగునాట హాస్య రచనలలో అందె వేసిన చేయి. ఈ ఫిబ్రవరి 11వ తేదీకి ఆయన జన్మించి సరిగ్గా నూట యాభై సంవత్సరాలు పూర్తవుతాయి.సాహిత్యాభిమానులకు పానుకంటి వారి పేరు వినగానే కంఠాభరణము గుర్తు వస్తుంది. నా బోంట్లకు మాత్రం జంఘాలశాస్త్రి, సాక్షి సంపుటాలే స్ఫురణకు వస్తాయి. మొత్తం మూడు సంపుటాలలో మొత్తం 148 వ్యాసాలున్నాయి. వీటిలో జంఘాల శాస్త్రి ఉపన్యాస ఝరి వర్ణించడం మన తరం కాదు. మచ్చుకు పది మంది స్త్రీలు ఒక చోట చేరితే ఆ దృశ్యం యెలా ఉం(టుం)దో చెప్పడానికి శాస్త్రిగారు ప్రయోగించిన పద సముచ్చయాలను గమనిం చండి. నవ్వు ఆపుకోగలిగితే అది మరో నవ్వాత్మక సంఘటనే అనుకోవాలి.కదా

"కొర్నాటి చీరలవారు, బనారసుకోకలవారు, బరంపురపు పీతాంబరములవారు, సన్నకుసుంబాచీరలవారు, గోచికట్లవారు, గూడకట్లవారు, చుట్టుత్రిప్పులవారు, మేలిముసుగులవారు, వ్రేలుముళ్ళవారు, జడచుట్లవారు, వంకకొప్పులవారు"... ఇదీ వరస...

ఇక మరో రసధార... "మ్యావుమని కూయలేని పిల్లి యెచ్చటైననుండునా? కిచకిచలాడలేని కోతిని మీరెక్కడైన చూచితిరా?... అయ్యయ్యో. మనుజుడే. అంత మనుజుడే. ఆంధ్ర మాతాపితలకు బుట్టినవాడే... అట్టివాడాంగ్లేయభాషనభ్యసించి నంత మాత్రమున ఇప్పుడాంధ్రమున మాట్లాడలేకుండునా? ఆశ్చర్యము, అవిశ్వస నీయము. అసత్యము. ఆంధ్రమున మాటాడకుండ చేసినది అశక్తికాదు. అనిష్టత. అసహ్యత. అది శిలాక్షరమైన మాట... తెలుగుబాస యంత దిక్కుమాలిన బాస లేదనియే యా యాంగ్లేయ తేజస్సు నమ్మకము". ఇది ఎందుకో చెప్ప బని లేదు.

ఇంతటి ప్రతిభా విశేషాలు గల పానుగంటి వారు రాజమహేంద్రిలో వేంకట రమణయ్య, రత్నమాంబ దంపతులకు జన్మించారు. రమణయ్యగారు మంచి గాయకులు, విద్వాంసులు. మన హీరోగారికి చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణా లున్నాయి. పదిమందినీ పోగేసుకుని నాటకాలాడటం, సంఘసేవా కార్యక్రమాలు చేపట్టడం అలవాటు. కానీ ఇతని బృందం చేష్టలు రాజకీయ నాయకులకు గిట్టేవి కావు. మూఢాచార పరాయణులకూ వేసటే. దాంతో పరిస్థితులను ఆకళింపు చేసుకున్న రమణయ్యగారు రాజకీయాల వల్ల ఉపయోగం లేదనీ, మంచి ఉద్యోగి కావాలనీ, అంతగా కావాలనుకుంటే రచనల ద్వారా సంప చేయవచ్చుననీ బోధించారు. నిజమే అనుకున్న నరసింహారావు రచనా వ్యాసంగంలో పడ్డాడు. చదువులో తక్కువేమీ కాదు గానీ, తండ్రి చదువు, చదువు అని తిడతాడేమోనన్న శంకతో తన రాతలను తల్లికీ, మిత్రులకూ మాత్రమే చూపేవాడు. విశేషమేమిటంటే బడి రోజుల్లోనే ఇతను రాసిన వో నాటకాన్ని అక్షరం వదలకుండా ఉపాధ్యాయులే నటులై ప్రదర్శించడం. విక్టోరియా రాణి జన్మదినోత్సవం సందర్భంగా సర్కారు వారి ఆదేశానుసారం బడిలో ప్రదర్శించేందుకై ప్రధానోపాధ్యాయుడే ఇతని చేత హాస్య నాటిక వ్రాయించగా దానినే ఆ ఉపాధ్యాయులు ప్రదర్శించారన్నమాట.

సరే, హీరోగారు బి.ఏ. అయిందనిపించాడు. కానీ న్యాయవాదం చదవడం వీలు కాలేదు. చేత పైసలు లేకపోవడంతో టీచరుగా స్థిరపడ్డారు. ఈయన ధోరణి చూసి పిల్లలూ, వారి పెద్దలూ మొదట భయపడినా తర్వాత మాట కరకు, మనసు వెన్న అని గ్రహించారనుకోండి. అయితే ఆ రోజుల్లోనూ బతకలేక బడి పంతులే గనుక విడిగా ట్యూషన్లు చెప్పుకునేవాడు. అలా ఓ జమీందారుకు చేరువై ఆయన ఇలాకాలో దివానుగా యెదిగాడు. కానీ అక్కడి అక్రమాలను తనదైన ధోరణిలో బయటపెడుతూండడంతో బంధువులు పగబట్టి జమీందారుకు ఏవేవో నూరిపోసి బయకు సాగనంపారు. అయితే కలం బలం ఉన్నవాడు గనుక దైవ బలం తోడై పిఠాపురం జమీందారు వద్దకు చేరగలిగాడు.

ఆ సమయంలోనే తణుకు నుంచి వెలువడే 'సువర్ణలేఖ' అనే పత్రికలో 'సాక్షి' వ్యాసాలు వెలుగు చూడసాగాయి.హాస్య రచయితగా పేరు గడిస్తూనే సంఘంలోని దురాచారాలనూ, అన్యాయాలనూ, అక్రమాలనూ తన రచనల ద్వారా యెండగడుతూ వచ్చిన నరసింహారావు సారంగధర, ప్రచండ చాణక్యము, విచిత్ర వివాహము ఆదిగా పదుల సంఖ్యలో రచనలు సాగించారు. ప్రతి ఒక్కటీ గిలిగింతలు పెట్టే హాస్యంతో పాటు వెలలేని సందేశాన్ని కూడా అందించడం మనందరం ఆనందించదగిన ప్రత్యేకత. తెలుగు జాతికి ఇంతగా సేవలందించిన నరసింహారావు 1940లో స్వర్గస్థులైనారు.

– పి.వి.ఆర్. గోపీనాథ్, పుణె


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# సంకల్పసిధ్ధులై సంగీతరంగంలో సార్వభౌమత్వాన్ని సాధించిన "గాయక సార్వభౌమ" పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి 71 వ ఆరాధనోత్సవం సందర్భంగా అక్షరాంజలి

అది దివిసీమ.

కృష్ణా నదీమ తల్లి పుణ్య జలరాసులలో తడిసి – నాట్య, నాటక, సంగీత వైదుష్య ప్రవంతిలో తనిసి– సరిగమల సందడితో, సిరిమువ్వల సవ్వడితో ఆంధ్రావనికి యావత్ ప్రపంచంలో కీర్తిప్రతిష్ఠలు సముపార్జించిపెట్టిన దివ్యసీమ. ఆ దివ్య దివిసీమలో ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వర స్వామిగా విరాజిల్లే శ్రీకాకుళ గ్రామం. ఆంధ్ర భోజుడు శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్తమాల్యదకు శ్రీకారం చుట్టిన పుణ్యస్థలి. ఆపైన ఎందరెందరో నటగాయకులకు జన్మనిచ్చిన సకల కళాధామం.

పారుపల్లివారికి ఆటపట్టైన ఆ శ్రీకాకుళ గ్రామంలో ప్రభవించిన ప్రజ్ఞామూర్తి రామకృష్ణయ్య పంతులు. సంగీత రంగంలో సార్వభౌమత్వాన్ని సాధించిన – "గాయక సార్వభౌమ" పారుపల్లి రామకృష్ణయ్య పంతులు.

పచ్చని మేనిఛాయతో నిండిన ఆజానుబాహు విగ్రహం. శుద్ధమైన తెల్లని పంచెకట్టు. నల్లని కోటు. మీసకట్టు. వెండి జరీ తలపాగా, ఉత్తరీయాలతో... చేత తంబుర పట్టిన ఆ గానతేజస్విని చూచిన క్షణాన – ఎంతటివారికైనా చేతులు జోడించి నమస్కరించాలనిపించక మానదు. 1882 వ సంవత్సరంలో శేషాచల, మంగమాంబ దంపతుల గర్భసూక్తి ముక్తాఫలంగా జన్మించిన రామకృష్ణయ్య పంతులు గారు – తొలుత 'ఉద్యోగం పురుష లక్షణం'గా – మేనమామగారి ప్రోత్సాహంతో చల్లపల్లి సంస్థానంలో రాణేదారు పదవి నిర్వహించారు. కానీ, పురాకృత సంగీత బీజం తొలిమొగ్గలు తొడగడం వల్ల ఆయన మానసం సంగీత విద్యవైపు మొగ్గు జూపింది. ఫలితంగా సద్గురు త్యాగరాజస్వామి వారి సుసంప్రదాయ సంగీతపీఠంగా విరాజిల్లుతున్న పెదకళ్ళేపల్లి గ్రామంలో ... సంగీత విద్వత్ వాగ్గేయకారక – బ్రహ్మశ్రీ సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రుల వారి వద్ద గురుశుశ్రూషను ఆరంభించారు రామకృష్ణయ్యగారు.



తిరువాయూర్‌లో స్థిరపడి, సద్గురు త్యాగరాజ స్వామి వారి వద్ద అకుంఠితంగా శ్రమించి ఆ సంప్రదాయాన్ని ఆంధ్రులకు తరగని భిక్షగా అందించిన తెలుగుబిడ్డ ఆకుమడుల (మానాంబుజావడి) వెంకట సుబ్బయ్యగారు. ఆపై పెదకళ్ళేపల్లి నుంచి తంజావూరు నడచి వెళ్ళి, వెంకట సుబ్బయ్య గారి శుశ్రూషలో విద్య నార్జించి, ఆంధ్ర దేశంలో త్యాగరాజ పరంపరా గతమైన సంగీత స్థాపన, ప్రాచుర్యాలకు ఒక ఉనికిని ప్రసాదించిన పరమగురు శిఖామణి శ్రీ సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులవారు. వారికి అంతేవాసులై అపార సంగీత విద్యా రహస్యాలను ఆర్జించి... త్యాగరాజ సుసంప్రదాయాన మూడవ తరం సంగీత గురుశ్రేష్ఠులైనవారు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు.

దక్షిణామూర్తి శాస్త్రుల వారి గురుపీఠంలో – రామకృష్ణయ్య పంతులుగారి సహపాఠీలుగా సంగీత విద్య నార్జించిన రాజనాల వెంకటప్పయ్య శ్శాస్త్రి గారు, చల్లపల్లి సీతారామయ్య గారు, ద్వివేదుల లక్ష్మణ శాస్త్రి గారు, దుడ్డు సీతారామయ్య గారు, చల్లపల్లి పంచనదేశ్వర శాస్త్రి గారు, ఇత్యాదులందరిలో – ఆంధ్రదేశంలో అవధులు లేని శిష్య, ప్రశిష్య, ప్రప్రశిష్య గణం ఏర్పడడం రామకృష్ణయ్య పంతులు గారి విశేష సంగీత సేవకు నిదర్శనంగా విరాజిల్లింది.

విస్తృత సంగీత విద్యత్ గణంలో ఒక విశిష్ట స్థానాన్ని పొంది, గురుస్థానానికి అర్హత నార్జించుకున్న తరుణంలో .... ఆనాడు సంగీతమంటే దాక్షిణాత్యులదే అనుకునే తమిళనాట స్థిరపడవలసిందిగా ఎన్ని ఆహ్వానాలు వచ్చినా– ఆయన అంగీకరించలేదు. "ఇది నానేల. దీనిని సుస్వర శ్యామలం చేయాలి. ఇది నా సంకల్పం.

"రెక్కలు వచ్చినాయి కదా అని... నా తెలుగు గూటిని విడచి మరోచోటికి ఎగిరిపోవడానికి నా మనసు అంగీకరించదు. అది నా స్వభావానికి విరుద్ధం." అని.. ఆ పిలుపులను సున్నితంగా తిరస్కరించి... విజయవాడను సంగీత విద్యా వ్యాప్తికి వేదికగా చేసుకుని, తమ స్వగృహమే ఒక కళాశాలగా ఎంతోమందిని సంగీత విద్యలో తీర్చిదిద్దారాయన.

ఒకవైపు వర్ణాశ్రమ విహితమైన వైదిక కర్మలను అనుష్ఠిస్తూనే.. విద్యాబోధనలో మాత్రం ఏ జాతి, మత, కుల, విచక్షణ చూపక – అర్హులైన వారందరికీ ఉచితంగా గాత్ర వాయులీనాలలో సంగీత జ్ఞానాన్ని అందించిన వైతాళికుడు రామకృష్ణయ్య పంతులు గారు.

డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, అన్నవరపు రామస్వామి, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, నేతి శ్రీరామ శర్మ, పాతూరి సీతారామయ్య చౌదరి, తిరుపతి పొన్నారావు, వంకదారి వెంకట సుబ్బయ్య గుప్త, ఎమ్.వి. రమణమూర్తి, దాలిపర్తి పిచ్చలహరి సోదరులు, చిలకలపూడి వేంకటేశ్వర శర్మ, అద్దంకి శ్రీరామమూర్తి, మద్దులపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి, లంకా వెంకటేశ్వర్లు, టి.కె. యశోద, జి.వి.రామకుమారి .... ఇలా అన్ని వర్ణాలవారు, అన్ని వర్గాలవారు, ఎందరో ... ఎందరో... రామకృష్ణయ్య గారి శిష్యులై ఆకాశవాణి కేంద్రాలలో, సంగీత కళాశాలలో సంగీత సేవ లందించ డానికి నిధులుగా భాసిల్లారు.

ఇలా.. వందలాదిగా శిష్య ప్రశిష్య గణాన్ని సంత రించుకున్న లబ్దప్రతిష్టకు నిదర్శనంగా, ఆయన అద్వితీయ విద్వత్తుకు సాదృశంగా... నాటి మద్రాసు పాలకులు లార్డ్ పెట్లెండ్ ప్రభువు గారి చేత స్వర్ణపతక సత్కారం, బరోడా అఖిల భారత సంగీత సభా సత్కారం, కాకినాడలో ప్రతి ష్ఠాత్మక శ్రీరామ సమాజం వారి విశిష్ట స్వర్ణ పతకాభరణ సన్మానం, మద్రాసు మ్యూజిక్ అకాడమి ఎక్స్‌ఫర్ట్ కమిటీలో సభ్యత్వ గౌరవం, ఆంధ్ర సారస్వత పరిషత్ వారి "భారతీ తీర్థోపాధ్యాయ" బిరుదు ప్రదానం, ఆపైన సంగీత ప్రపంచంలో మరెవరికీ లభించని గజారోహణం, "గాయక సార్వభౌమ" బిరుద ప్రదానం రామకృష్ణయ్య పంతులు గారిని వరించాయి. అలా లెక్కల కందిన సన్మానాలు కొన్నైతే, ఆ లెక్కల కందని సత్కారాలు ఎన్నో.. మరెన్నో....

విద్వాంసులెంతో మంది ఉండవచ్చు. కానీ సముచితరీతిలో గురుస్థానాన్ని పొందగలిగినవారు అరుదు. నిష్కల్మష హృదయం, నిర్మల స్వభావం, పరిపూర్ణ శిష్యవాత్సల్యం, నిరంతర గురుభక్తి, యిత్యాది సద్గుణ సంపత్తిని ప్రోది చేసుకున్నవారు మాత్రమే సద్గురువులవుతారు. అలా సకల సద్గుణ సంపత్తితో, సంగీత ప్రపంచంలో అయిదు దశాబ్దాలు నిర్విరామంగా శ్రమించి, స్మిత, హిత, మితభాషణంతో – వినాదైన్యేన జీవనాన్ని గడిపి – వారి గురువుగారు సుసర్లవారి ఆరాధనోత్సవాలు సద్భక్తితో నిర్వహిస్తూ – 1951 జూలై 7వ తేదీన గురు ఆరాధన సమయాన, నిత్యానుష్ఠాన సహితంగా గురు ఆరాధనను పూర్తి చేసుకుని, విజయవాడలో వారు వసించే గురుకుల భవనాన్ని దిగి క్రిందకు వచ్చి తూర్పుదిశగా సాష్టాంగ ప్రణామంగా ఒరిగి ... నాదబ్రహ్మ సాన్నిధ్యాన్ని పొందారు కారణజన్ములైన రామకృష్ణయ్య పంతులు గారు.

ఆనాటి నుంచీ ఈనాటిదాకా సంగీత ప్రపంచంలో – సార్వభౌమత్వం సాధించుకున్న వారు ఒక్కరే. వారే సంకల్పసిద్ధులైన "గాయక సార్వభౌమ" పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు.

– పారుపల్లి

# ఎవరు ముందు చెప్పినట్లు?

స్త్రీ యొక్క మానసిక స్థితి ప్రభావం ఆమె గర్భంలోని పిండంపై పడుతుందనేది ఫ్రాయిడ్ చెప్పిన సిద్ధాంతం కదా!

మరి ఈదేశంలో ఎప్పటినుంచో గర్భవతులు భక్తిగాథలూ వీరగాథలూ వినాలనీ చదవాలనీ ఎల్లపుడూ అందమైన ఆరోగ్యవంతమైన బిడ్డకోసం శ్రీరాముని చిత్రపటాన్ని చూస్తుండాలనీ స్మరించుకోవాలనీ... భయంకర వార్తలూ విషాద సంఘటనలకూ దూరంగా ఉండలనీ ఈ ఫ్రాయిడ్ చెప్పకముందునుండే ఎలా చెప్పేవారబ్బా?

బిగ్ బ్యాంగ్ థీయరి ఒక అగ్నిగోళం బ్రద్ధలయి సృష్టి ఏర్పడిందని తేల్చింది కదా!

మరి మన దేశంలో అనామకుడు సైతం" బ్రహ్మాండం బద్దలయ్యిందనే "వేదజనిత సృష్టి మూలం పలుకుతున్నాడెలా??

భూమి మీద ప్రకృతి ఏర్పడి దాదాపు 200 కోట్ల సంవత్సరాలయిందని నేటి సైటింస్టులు చెబుతున్నారు కదా!

మరి మన పురాణాలు చెప్పే కాలమాణం ప్రకారం యుగాలు మహాయుగాలూ మన్వంతరాలూ సంధికాలాలను లెక్కేస్తే... మనం శ్వేతవరాహ కల్పంలో 28 వ మహాయుగంలో కలియుగంలో ఉన్నామని ప్రస్తుత సంవత్సరం... నాటికి 197, 29, 49, 120 సంవత్సరాలు అవుతోంది... మరి సైంటిస్టుల కాలగణనతో సరిపోతోందెలా??

బిగ్ బేంగ్ జరిగి విడిపోయిన పదార్థం వల్ల సృష్టి ఏర్పడిందని అది తిరిగి కేంద్రం వల్ల ఆకర్షింపబడి పదార్థం ఏర్పడటం వల్ల సృష్టి నశించి శూన్యం అవుతుందనీ అది తిరిగి మళ్ళీ బ్రద్దలయి సృష్టి మొదలవుతుందని ఇలా జరుగుతునే ఉంటుందని నేటి సైన్స్ చెప్పిన విశ్వముఖులిత సూత్రం కదా!

మరి వేదసారమైన భగవద్గీతలో చెప్పబడిందేంటి? కల్పకం అంతమందు సకల ప్రాణులూ తన యందు లీనమవుతాయని మళ్ళీ కల్పకం ఆరంభంలో అన్నీ తననుండి పుట్టుకొస్తాయని భగవానుడు చెప్పినట్లు ఉందెలా?

ప్రతీ చర్యకూ సమాన స్థాయిలో ప్రతిచర్య ఉంటుందనేది న్యూటన్ చెప్పిన సూత్రం కదా!

మరి వేల సంవత్సరాల నుండి భారతదేశంలో వినిపించే కర్మసిద్ధాంతం చెప్పేది ఏంటి? ఎవరు ముందు చెప్పినట్లు?

తొలి విమాన నిర్మాణం చేసిన మేధావులు రైట్ సోదరులు కదా!

అంతకు ముందు భారతీయులకు ఉన్న విమాన శాస్త్రాన్ని కూడా కాస్త పక్కన పెడదాం... రైట్ సోదరుల కంటే ముందు శివరాం బాపూజీ తల్పాడే అనే పండితుడు మన పురాతన గ్రంథాల ఆధారంగా తయారు చేసిన "మరుత్సబి" గాలిలో ఎగిరింది కదా.. మధ్యలో ఆగిపోయిన ఆ విమాన ప్లాన్ ఈయన వారసులు ఓ ఆంగ్లేయ కంపెనికీ అమ్మినట్లు తెలుస్తోంది...మరి అది ఏమైనట్లో...ఆ ప్రస్తావనే తేదెందుకు ఈ ప్రపంచం...

మొక్కలకు ఫీలింగ్స్ ప్రాణం ఉన్నాయని నిరూపించింది మన దేశీయుడైన శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ కదా!

మరి ముందు ఈ విషయం మనవారికి తెలియదా?మన గ్రంథాలలో వృక్షాల భావాల ప్రస్తావనలు లెక్కలేనన్ని ఉన్నాయే...మన ఋషులు మొక్కలను ప్రార్థించే దర్భలను సేకరించేవారు... మరి వారికి ఈ విషయాలు తెలియదనే అనుకుందామా...

పెద్దపెద్ద వృక్షాలయే మొక్కల్ని రూపలక్షణాలు మారకుండా కుండీలలో చిన్నమొక్కలుగా పెంచే ప్రక్రియ "బోన్సాయ్"నేటి విజ్ఞానశాస్త్రం కదా!

మరి భారతీయ ప్రాచీన ఆయుర్వేద ఋషి చరకుడు తన చరకసంహిత గ్రంథంలో "వామన తను వృక్ష్యాది విద్య" అను ప్రకరణంలో వైద్యానికి ఉపయోగించే పెద్దవృక్షాలను గుణం చెడకుండా చిన్నమొక్కలుగా పెంచే ఈ విధానాన్నే తెలిపాడెలా??

తులసి మొక్క ద్వారా స్వైన్ ఫ్లూ వంటి ప్రాణాంతక వ్యాదుల్ని అరికట్టవచ్చని వైద్యులు ఇప్పుడు ఒప్పుకుంటే.... మరి యుగాల కాలం నుండి ప్రతి ఇంట తులసి మొక్కను పూజిస్తారెందుకబ్బా!......

సముద్రగర్భంలో అగ్నిపర్వాతాలు ఉన్నట్లు మనం ఈమధ్య గమనించినట్లు చెప్పుకుంటాం కదా!

మరి మన పురాణాలకాలం వారికి "బడభాగ్ని"గురించి ఎలా తెలిసిందబ్బా...

భారతీయ గోవు మనిషి ఆరోగ్యాన్ని పెంచుతుందని శాస్త్రవేత్తలు పరీక్షించి ఇప్పుడు నిర్ధారిస్తే....మరి గోమాతను దైవంగా భావించి కొలిచే ఆనవాయితీ యుగాలకాలం నుంచి ఎందుకుందబ్బా!.....

లోహవిజ్ఞానంలో నేటిమనం చాలా అడ్వాన్స్ గా ఉన్నమని చెబుతాం కదా!

మరి ప్రాచీన భారతీయులు ఢిల్లీలో నిర్మించిన ఇనుప స్తంభం (విష్ణు ద్వజం) ఇప్పటికీ తుప్పు పట్టకుండా నిలిచి ఉంటే దానికి పోటిగా ఆధునికులు నిర్మించిన ఇనుప స్తభం తుప్పపట్టి కనిపిస్తుందెలా??

నిర్మాణ రంగంలో ఆధునికులు చాలా ముందున్నాం అని చెప్పుకుంటాం కదా!

మరి వేల సంవత్సరాల నాటి ఆలయాలు కోటలూ ఇప్పటికీ నిలచి ఉంటే గత 500 సం॥లోపు నిర్మాణాలు నిలబడుటలేదేమి?

గోల్కొండకోటలోని శబ్ధప్రసారపద్ధతి వివిధ దేవాలయాలోని సంగీతం పలికే స్తంభాలూ శివాలయంలో లింగంపై చెక్కుచదరని నీడ పడే నిర్మాణాలూ.....ఏ సమయంలోనూ నీడ కనిపించని ఆలయాలు, స్తంబాలు గాల్లో నిలబడి బరువులు మోసే భారీ కట్టడాలు, గోపురం నీడ ఒక సమయంలో వ్యతిరేక దిశలో పడే అద్భుత కట్టడములు వీటన్నింటి గురించి ప్రాచీన భారతీయులకు నేటి ప్రపంచం ఇచ్చే సమాధానమేంటి??

అణువు పరమాణువు గురించి వాటిలోని శక్తి గురించి ఆధునికులకు మాత్రమే తెలుసు కదా!

మరి భారతీయ గ్రంధాలు తిరగేస్తే పరమాణువుల గురించి "వైషేశిక సూత్రం" అంటూ ఓ గ్రంథమే కనిపిస్తుందే... దీనిని రాశిన కశ్యపుడను ఋషికి కణాల వివరణ చెప్పిన కారణంగా కణ్వదమహర్షి అను పేరు వచ్చినట్లు తెలుస్తోంది...ఎవరు ముందు చెప్పినట్లు??

మెండలీఫ్ ఆవర్తన పట్టికలో పాదరసం, బంగారం పక్కపక్కన చూపించేవరకూ పాదరసం నుండి బంగారం చేయవచ్చని మనకు తెలియదు కదా!

మరి వీటి గురించి తెలీకుండానే మన పూర్వీకులు ఈపని ఎలా చేశారు...ఈ పని చేసేవారిని "రసవాదులు"అనికూడా పేరెట్టి పిలిచారే.....

సూర్యుడు ఓ నక్షత్రమనీ చాలా నక్షత్రాలలో సూర్యుడు కూడా ఒకడు మాత్రమేనని మన నేటి శాస్రజ్ఞుల విజ్ఞానం కదా!

మరి మన పూర్వీకులకు ఇది తెలియకుండానే అరుణ మంత్రంలో "సప్తదిశో నానా సూర్యాః" అని చెప్పారనుకుందామా??

భూమినుండి విడివడిన కొంతభాగమే చంద్రుడనీ ఆ భాగం విడివడిన చోటు పసిఫిక్ మహా సముద్రం ఏర్పడిందనీ శాస్త్రవేత్తల పరిశీలన కదా!

విజ్ఞానాన్ని కథలుగా చెప్పే సంస్కృతి గల మన దేశ పూర్వులు చెప్పిన సాగరమధనం కథ ద్వారా బాగా గమనిస్తే తెలిసేదేంటి? పాల సముద్రం నుండి చంద్రుడు పైకెగసినట్లు చెప్పారే...




ప్రపంచం నేడు చదువుతున్న చరిత్ర ప్రకారం గ్రహణం గురించి మొదటగా చెప్పింది చైనావారని చెప్తున్నారు కదా! (2137 క్రీ.పూ)

అంతకు పూర్వంవాడైన అత్రిమహాముని చరిత్రకు పనికిరానివాడెలా అయ్యాడు? ఆయన తయారు చేసిన "తురీయ బ్రహ్మ"అనే టెలిస్కోప్ సహాయంతో మొదటగా గ్రహణం పరిశీలించాడే (ఋగ్వేదం 5వమండలం 40-6 మంత్రం)

ఈ విషయం మన గ్రంధాలలో అనేక చోట్ల కనిపిస్తోందని శ్రీ బాలగంగాధర్ తిలక్ తేల్చారు కూడా.....

ప్రస్తుతం భారతదేశం న్యాయవ్యవస్థ విదేశాలను అనుసరించిది అని వాదిస్తుంటారే!

మరి క్రీస్తు పూర్వం వేల సంవత్సరాల క్రితం విఘ్నేశ్వరుడు రచించిన "మితాక్షర" గ్రంధం లోని అంశములను తెలియబరుస్తూ యాజ్ఞవల్క ఋషి రచించిన స్మృతులను, 13వ శతాబ్దంనాటి తెలుగు కవి కేతన రచించిన విఘ్నేశ్వరం అనే గ్రంథంలోని అంశములను, ఇప్పటికి హిందూ న్యాయ వ్యవస్థ అనుసరిస్తున్నదని న్యాయ పుస్తకాల్లోనే ఎందుకుంది?

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో....మనకు జరిగిన అన్యాయం వర్ణించలేనిది... రాతి యగంలో వేదాలు రాసిన వారికి అంత జ్ఞానం ఉండదని విదేశీయులు నేర్పిన చిలకపలుకులు నేటికీ వల్లే వేసే బానిస మనస్కులు తెలుసుకోవలసిందీ ఒకటుంది... రాతియుగం పరాయి పాలన...అంతకుముందంతా రత్నయుగమేనని...

ప్రపంచం కళ్ళు తెరవక ముందే మనం చిరునవ్వు నవ్వాం, ఆటలాడి పాటలు పాడాం...

నేడు నీచులచే వక్రీకరింపబడ్డ మన చరిత్రను నమ్మి మన భారత జాతిని, పురాణాలను, గ్రంధాలను, ఇతిహాసాలను తూలనాడే స్థితిలో ఉన్నాం...

ఇప్పుడు చెప్పండి.. ఎవరు చెప్పినట్లు ముందు ఈ లోకానికి లౌక్యం..?

ఇలాంటి మరుగునపడిన భారతీయ చరిత్ర గురించి చిన్నతన్నం నుండి పాఠ్య పుస్తకాలలోగాని పాఠశాలల ద్వారాగాని పిల్లలకు తెలియనియక మెకలె విద్యా విధానం ద్వారా వక్రీకరించబడ్డ చరిత్ర చదివి ప్రతి ఒక్కటీ విదేశీవాడే కనుగొన్నాడన్న ధోరణిలో విదేశాలకు జేజేలు పలుకుతూ మన భరత మాతను భారతదేశాన్ని పనికిమాలిన దేశం ఇక్కడ ఏమున్నదని తిట్టే స్థాయికి చేరుకున్నాం. కనుక మన దేశ ఘన చరిత్ర గురించి భావితరానికి తెలియజేయండి మన పూర్వీకుల జ్ఞాన భాండాగారాన్ని తిరిగి పంచండి అప్పుడే దేశం పట్ల జాతి పట్ల సంస్కృతి పట్ల ఆచార వ్యవహారాల పట్ల గౌరవ భావం తోపాటుగా దేశ భక్తి పెరుగుతుంది. ●

# సత్పురుషుల సాంగత్యం



సత్పురుషులు తమ మనసులో కూడా ఇతరుల గురించి ఎప్పుడూ చెడుగా ఆలోచించరు. వారు ఎప్పుడైనా ఇతరులకు ఉపకారం చేయాలని మాత్రమే ఆలోచిస్తారు. అలాంటి వ్యక్తులు ప్రతి వ్యక్తిలోనూ మంచిని మాత్రమే చూస్తారు, వారు చెడు లక్షణాలను ఎప్పుడూ చూడరు. ప్రతి వ్యక్తిలోనూ మంచి మరియు చెడు రెండు లక్షణాలు ఉంటాయి. అందరూ మంచివారు కాదు, అందరూ చెడ్డవారు కాదు. ప్రతి వ్యక్తిలోని మంచి లక్షణాలను మాత్రమే మనం చూడాలి. చెడు లక్షణాలపై మనం ఎప్పుడూ శ్రద్ధ చూపకూడదు, అలా చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. గొప్ప వ్యక్తులు అలా వుంటారు. ఈ విషయంలో శివుడిని ఒక ఉదాహరణగా ఉదహరించారు పెద్దలు. క్షీర సాగర మథనంలో చంద్రుడు మరియు హాలాహాలా విషం ఉద్భవించినాయి. శివుడు ప్రతి ఒక్కరికీ కనిపించే విధముగా చంద్రుడిని తన తలపై ఉంచాడు. విషాన్ని మాత్రం తన గొంతులో దాచిపెట్టాడు. దీని వెనుక అర్థం ఏమిటి? చెడు బయటకు రాకుండా మనం నిరోధించాలి, మంచిని మాత్రమే ప్రదర్శించాలి.

పండితుడు గుణ, దోషాలను రెండిటినీ గ్రహించి, గుణాన్ని నెత్తిన పెట్టుకుంటాడు. దోషాన్ని నియంత్రిస్తాడు. శివుడు చంద్రుణ్ణి శిరస్సు మీద ఉంచుకున్నాడు. విషాన్ని గొంతులోనే నిలిపిఉంచాడు.

మనం మంచి లక్షణాలను మాత్రమే చూడాలి, చెడు కాదు. కానీ ఇతరులలోని చెడు లక్షణాలను మాత్రమే చూడటం మనిషిలో ఒక అవ లక్షణం. కానీ గొప్పవారు అలాంటివారు కాదు, వారు మంచిని మాత్రమే చూస్తారు. అందువల్ల, మనము గొప్పవారితో కలిసి ఉంటే, మనము కూడా వారి లక్షణాలను పొందుతాము. సత్పురుషుల సహవాసంతో సత్పురుషుల లక్షణాలు అలవాడతాయి. అందువల్ల శ్రీ శంకరాచార్యులు వారు ఎప్పుడూ మంచి వ్యక్తుల సహవాసంలో ఉండాలని మరియు చెడుతో సహవాసం చేయకుండా ఉండాలని సలహా ఇచ్చారు.

– శృంగేరి జగద్గురు జగద్గురు శ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు


# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినేలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**


ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**

64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.

మొబైల్ : 98400 48941



# ఆధ్యాత్మిక మార్గదర్శి

"మతం గురించీ, ఆధ్యాత్మికత గురించీ మాట్లాడడం సులువు. కానీ వాటిని పాటించడం కష్టం" అన్నారు రామకృష్ణ పరమహంస. ఆయన వాటిని త్రికరణశుద్ధిగా పాటించారు. మహా భక్తునిగా, భారతీయత విశిష్టతను విశ్వమంతటికీ చాటి చెప్పిన వివేకానందుని గురువుగా ఆయనది అద్వితీయమైన స్థానం.

తనను యోగిగా, దైవంగా ఆరాధించేవారికి రామకృష్ణులు చేసే బోధలు విలక్షణంగా ఉండేవి. ఆయన ఆశ్రమాలు ఏర్పాటు చేయలేదు. తనదైన ఆధ్యాత్మిక సిద్ధాంతాన్ని ప్రకటించలేదు. తనను కలిసిన వారు చెప్పుకొనే సమస్యలకూ, అడిగే ప్రశ్నలకూ చిన్న చిన్న కథలతో, ఉదాహరణలతో ఆయన పరిష్కారం చూపించేవారు.

శ్రీ రామకృష్ణ పరమహంసను శ్రీ మహావిష్ణువు అవతారంగా భావించేవాళ్ళు ఉన్నారు. కానీ ఆయన ఎప్పుడూ ఆ మాట చెప్పుకోలేదు. చిన్నతనం నుంచీ ఆయనకు బడిలో చెప్పే పాఠాలన్నా, ప్రాపంచికమైన విషయాలన్నా ఆసక్తి ఉండేది కాదు. తల్లితండ్రులు ఆయనకు పెట్టిన పేరు గదాధర్. పాటలు పాడడం, బొమ్మలు గీయడం బాల్యంలో ఆయనకు ఇష్టమైన వ్యాపకాలు. తమ ప్రాంతానికి వచ్చిన సాధు సంతులకు సేవ చేసేవారు. వారి ప్రసంగాలను శ్రద్ధగా వినేవారు. ఆరేళ్ళ వయసు నుంచే ఆయన మనసు ఆధ్యాత్మికత వైపు మళ్ళింది. ఆ ధోరణి క్రమేపీ పెరుగుతూ వచ్చింది. తల్లి చెప్పే జానపద కథలను ఆయన ఇష్టంగా వినేవారు. రామకృష్ణులు చదువుతున్న బడిలో నాటకం వేశారు. శివుడి పాత్ర వేసిన ఆయన ఆ పాత్రలో లీనమై స్పృహ కోల్పోయారు. తన్మయత్వంతో తనను తాను మరచిపోయే లక్షణం ఆయనకు బాల్యం నుంచీ ఉంది. ఇరవై మూడవయేట ఆయనకు శారదాదేవితో వివాహమయింది.

ప్రసిద్ధమైన దక్షిణేశ్వర్‌లోని కాళికాదేవి ఆలయానికి రామకృష్ణుని అన్న రామ్ కుమార్ పూజారిగా ఉండేవారు. ఆ తరువాత రామకృష్ణులు ఆ బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆ ఆలయమే ఆయన లోకమైపోయింది. తాదాత్మ్యతలో మునిగిపోయి, కాళికాదేవితో సంభాషిస్తూ ఉండేవారు. ఆ దశలో తోతాపురి అనే సంచార సాధువు ఆయనకు పరిచయం అయ్యారు. అద్వైత వేదాంతాన్ని రామకృష్ణునికి బోధించడంతో పాటు దీక్ష కూడా ఇచ్చారు. ఎన్నో ఏళ్ళపాటు రామకృష్ణులు ధ్యానాన్ని కొనసాగించారు. క్రమేపీ ఆయన దృక్పథం, చింతనల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రతి మనిషిలోనూ దైవత్వం ఉందనీ, ప్రతి పురుషుడూ, మహిళా పవిత్రమైనవారేననీ ఆయన చెప్పేవారు. మహిళలందరినీ కాళికా స్వరూపాలుగా పరిగణించేవారు.

తనను యోగిగా, దైవంగా ఆరాధించేవారికి రామకృష్ణులు చేసే బోధలు విలక్షణంగా ఉండేవి. ఆయన ఆశ్రమాలు ఏర్పాటు చేయలేదు. తనదైన ఆధ్యాత్మిక సిద్ధాంతాన్ని ప్రకటించలేదు. పుస్తకాలు రాయలేదు, బహిరంగ వేదికల మీద ప్రసంగాలు చేయలేదు. ఎలాంటి సందేహం లేని విశ్వాసంతో, పరిపూర్ణమైన శరణాగతితో భగవంతుణ్ణి తన అనుభవంలోకి తెచ్చుకున్నారు. రామకృష్ణుల దృష్టిలో భగవంతుడు నిర్వచనాలకూ, వర్ణనలకూ అందనివాడు. అయితే వ్యక్తిగతమైన దృష్టిలో అందరూ దేవుడికి ఒక ఆకారాన్ని కల్పించుకుంటారు. ఎవరు ఏ ఆకారంలో, ఏ పేరుతో పూజించినా అంతిమ లక్ష్యం భగవంతుడి గురించి తెలుసుకోవడమేనని బోధించేవారు.

తనను కలిసిన వారు చెప్పుకొనే సమస్యలకూ, అడిగే ప్రశ్నలకూ చిన్న చిన్న కథలతో, ఉదాహరణలతో ఆయన పరిష్కారం చూపించేవారు. ఆత్మ ఉన్న ప్రతి ప్రాణికీ అంతిమ లక్ష్యం దైవం అనే సత్యాన్ని గ్రహించడమేననీ, మంచి నడవడికను అలవరచుకోవడం, ప్రాపంచిక సౌఖ్యాల నుంచి స్వేచ్ఛ పొందడం జరగకపోతే ఆ సత్యాన్ని గ్రహించడం అసాధ్యమని ఆయన చెప్పారు. అయితే, భగవంతుణ్ణి కనుక్కొనే క్రమంలో ప్రపంచాన్ని పూర్తిగా విస్మరించనక్కరలేదనీ, కానీ ఆత్మనూ, హృదయాన్నీ నిర్మలంగా మార్చుకోవాలనీ ప్రకటించారు. ఏ ధర్మాన్నయినా సక్రమంగా అనుసరిస్తే అది అంతిమ లక్ష్యానికి చేరువ చేస్తుందన్నది రామకృష్ణుల విశ్వాసం. శిష్యులతో ఆయన చేసిన సంభాషణలను ఆయన భక్తుడైన మహేంద్రనాథ్ గుప్తా నమోదు చేసేవారు. వాటిని 'శ్రీ రామకృష్ణ కథామృతం' అనే పేరుతో సంకలనంగా వెలువరించారు.

వివేకానందుడు మొదట హేతువాది అయినా, రామకృష్ణులను కలుసుకొని, ఆయనతో సంభాషించి, తన దృక్పథాన్ని మార్చుకున్నారు. ఇలా ఎందరికో గురువుగా ఆయన మార్గదర్శనం చేశారు. జీవితాంతం నిరాడంబరమైన జీవనం గడిపిన శ్రీ రామకృష్ణులు గొంతు కేన్సర్‌ను కూడా చిరునవ్వుతో భరించారు. సజీవంగా ఉన్నప్పుడే కాకుండా, మరణానంతరం సైతం ఆయన ప్రభావం భారత ఆధ్యాత్మిక రంగంపై ప్రస్ఫుటంగా ఉంటూనే ఉంది. ●






# పూర్వజన్మ సుకృతం గాయత్రి మంత్ర పఠనము...

చాలా మందికి గాయత్రీ మంత్రమనేది ఒకటి వుందని తెలిసినా, అదేమిటో అసలు ఎలా జపించాలో తెలియదు.

కొందరికి మంత్రము తెలిసినా కాలంతోపాటు పరిగెడుతూ హడావిడిగా జీవితాలను గడపాల్సిరావటం వల్ల ఈ మంత్రాన్ని గబగబ బట్టీ పట్టినట్టు మొక్కుబడిగా దేవుని ముందు అప్పగించేసి 'హమ్మయ్య ఈ రోజుకి చదివేసాను!' అనుకుంటారు.

నిజానికి గాయత్రీ మంత్రాన్ని అలా చదవకూడదు. అసలు గాయత్రీ మంత్రమేమిటో అది ఎలా జపించాలో తెలపాలనదే నా ప్రయత్నం.

గాయత్రీ మంత్రము అంటే

**ఓం భూర్భువస్సువః తత్ సవితుర్వరేణ్యం**

**భర్గోదేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్**

ఇది మంత్రము. ఈ మంత్రాన్ని ఏకధాటిగా చదవకుండా మంత్రాన్ని నాలుగు చోట్ల ఆపి చదవాలి.

అది ఎలాగంటే

**ఓం**

**భూర్భువస్సువః**

**తత్సవితుర్వరేణ్యం**

**భర్గోదేవస్య ధీమహి**

**ధియో యోనః ప్రచోదయాత్**

ఇలా మంత్రం మధ్యలో నాలుగు సార్లు ఆపి చదవాలి.

ఈ మంత్రములో "ఓం" అనేది "ప్రణవము", "భూర్భువస్సువః" లోని భూ, భువః, సువః అనేవి "వ్యాహృతులు". వ్యాహృతులు అనేవి దివ్యశక్తిని కలిగిన పదాలు. ఇవి మూడు లోకాలను సూచిస్తాయి. "తత్" నుంచి మిగిలిన భాగాన్ని "సావిత్రి" అని అంటారు.

గాయత్రి మంత్రంలో 24 బీజాక్షరాలున్నాయి. వాటిని ఆధారం చేసుకుని నిర్మితమైన కొన్ని గొప్ప ఆలయాలను ఒకసారి అవలోకించుకుందాం.

1. కంచి కామాక్షి మందిరంలో అమ్మవారు మూలవిరాట్టుగా కూర్చుని ఉన్న మంటపాన్ని గాయత్రి మంటపం అంటారు. ఆ ప్రాక్రారంలో 24 స్తంభాలున్నాయి. అవి 24 బీజాక్షరాలకు ప్రతీకలు.
2. కోణార్క్‌ని సూర్య దేవాలయ సముదాయం ఒక పెద్ద రథం మీద వున్నట్టు నిర్మించబడి వున్నది. ఆ రథానికి గాయత్రీ మంత్రానికి ప్రతీకగా 24 చక్రాలు వున్నాయి. వాటిని ఆంగ్లేయులు 24 గంటలని చెప్పారు. మనవాళ్ళు దానినే పట్టుకుని వేలాడుతున్నారు.
3. పురాణ కథనం ప్రకారం 24 గురు ఋషులు వారి మంత్రశక్తిని ఈ 24 బీజాక్షరాలలో నిక్షిప్తం చేసారు. అశోకుని ధర్మచక్రంలో వున్న 24 చువ్వలు (spokes) వాటికి ప్రతీకలు. దాన్నే మనం సమయచక్రం అని కూడా అంటున్నాము.
4. జైన సిద్ధాంతంలో 24 తీర్థంకరులు – ఇది అవైదిక మతమైనా వాటికి మూలం మన వేదమే.
5. 24 కేశవ నామాలు
6. 24 తత్వాలు : ఐదు జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, పంచ తన్మాత్రలు, 5 మహాభూతాలు, బుద్ధి, ప్రకృతి, అహంకారం, మనస్సు.
7. ఛందస్సులలో ఒకానొక గొప్ప ఛందస్సు గాయత్రి పేరు మీద వున్నది. భగవద్గీతలో శ్రీ కృష్ణుడు ఇలా చెబుతాడు : "బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ చందసామాహం"



8. రామాయణంలో 24 సహస్ర శ్లోకాలు.
9. రామాయణం గాయత్రి మంత్రాన్నే ప్రతిపాదిస్తోంది. కావాలంటే మీరే ఒకసారి తరచి చూడండి. 1, 1001, 2001, 3001, 4001, 23001 శ్లోకాలను గనుక మీరు చూస్తె మీకు గాయత్రి మంత్రమే కనబడుతుంది. దీన్ని గాయత్రి రామాయణం అని కూడా అంటారు.
10. ఒక వీణలో 24 చిర్రలు వుంటాయి. సంగీత శాస్త్రం తెలిసినవాళ్ళు దీన్నే గాయత్రి ఉపాసన అని అంటారు.
11. మన వెన్నుబాములో 24 ముదులాస్తులు (Cartilage) వుంటాయి. వాటికి అధి దేవతలే గాయత్రి మంత్రాక్షరాలు.

"న గాయత్రీ త్రాహ్య పరం మంత్రం... నమాతా: పర దైవతం" అన్నారు పెద్దలు.

24 బీజాక్షరాలతో కూడిన గాయత్రీ మాతను ఒక్కసారి జపిస్తే చాలు, సర్వ పాపాలు హరిస్తాయంటారు. సకల దోషాలు తొలగి పోతాయంటారు. సకల దేవతా స్వరూపం గాయత్రి. రామాయణ సారం గాయత్రి. కోర్కెలు తీర్చే మంత్ర రాజం గాయత్రి. విశ్వశాంతికి పరిష్కారం గాయత్రీ... సకల కోర్కెలు ఈడేర్చే మహా మంత్రం గాయత్రి... 24 బీజాక్షర సంపుటి గాయత్రీ..

గాయతితీ మంత్రం అత్యంత శక్తివంతమైనది, మహిమాన్వితమైనది, సద్బుద్ధిని ఇస్తుంది. బుద్ధి మనకు సంపదలను ప్రసాదిస్తుంది. ఆపదలను దూరం చేస్తుంది. గొప్ప పేరు ప్రతిష్టలను ఇస్తుంది. మనలోని చెడు శక్తులను పోగొట్టి తేజస్సును ఇస్తుంది. సంస్కారాన్ని ఇస్తుంది దాని ద్వారా ఉన్నతమైన ఆలోచనలతో ఇతరులను తరింపజేస్తుంది. గాయత్రీ కామధేనువు. ఎవరైతే గాయత్రీదేవి మంత్రాన్ని శ్రద్ధగా జపం చేస్తూ ఉంటారో ఆ సాధకునికి కామధేనువు తన వద్ద ఉన్నట్లే.

అలాంటి గాయత్రి మాతను స్మరణం చేసుకోవడం అంటే నిజంగా పూర్వ జన్మ సుకృతమే అని చెప్పాలి.

**లోకా సమస్తా సుఖినోభవన్తు**

# పరమార్థ కథలు



శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

## దుష్కర్మ ఫలితము

పూర్వకాలమున ఒకానొక పట్టణ ప్రాంతమున గజదొంగ ఒకడు కాపుర ముండెను. అతడు దొంగతనమున ఆరితేరినవాడు. ప్రజల సొత్తు క్రమముగ హరించి, దారి దోపిళ్లుచేసి, పలువురను వధించి ఎన్ని పర్యాయములో జైలుశిక్ష అనుభవించినవాడు. అతని హృదయమున దయ దాక్షిణ్యములకు చోటే లేదు. అతనికి రాత్రి పగలువంటిది. నిర్భయముగ భీకరారణ్యములందు, నిర్జన పర్వతప్రాంతము లందు నిశీథసమయమున సంచరించుచుండెను. అతడు అమాయకులను దోచు కొనుటలో అందె వేసినచేయి. ఈ ప్రకారముగ అతడు తన జీవితమును భ్రష్ట మొనర్చుకొనుచు, పాపమును మూటగట్టుకొనుచుండెను.

ఇట్లుండ ఒకనాడు ఒకానొకచోట హరికథ జరుగుచుండగా జనులు తండోప తండములుగ అచటకు వచ్చి నిశ్చలభక్తితో భగవత్కథాశ్రవణము గావించుచుండగా, తాళమృదంగాదులు భక్తుల వీనులకు సోకి తన్మయ మొనర్చుచుండగా, ఆ వేడుక గాంచుటకై వచ్చిన జనులమధ్య ఆ దొంగ కొద్దిసేపు కూర్చుండెను. అత్తఱి ధర్మమును గూర్చిన ప్రసంగము నడుచుచుండెను. అమూల్య మైన మానవ జీవితమును పాప భూయిష్టమైన కార్యములందు వ్యర్థము చేసినచో, తత్ఫలితముగ జీవుడు ఘోర యమయాతనలను అనుభవింపవలసి వచ్చునను సిద్ధాంతమును కథకుడు మనో రంజకముగ ప్రతిపాదించు చుండెను. ఆ వాక్యములు వినగనే తస్కరుని హృదయ మందు ఒకింత పరిణామము కలుగ నారంభించెను. "ఈ పాపపు బ్రతుకేల? జానెడు పొట్టకొఱకై అవినీతికరములైన కార్యముల నాచరించుట సిగ్గుచేటు. భవిష్యత్కాలమున ఏది శ్రేయమును ఒనగూర్చునో, ఏది శాశ్వతసుఖ మొసంగునో దానినే ఆశ్రయించవలెనుగాని నీచకార్యములకు గడంగి ఒకింత ప్రాపంచిక సుఖమును తాత్కాలికముగ సంపాదించుటకై యత్నింపరాదు. పాపముయొక్క భయంకర పరిణామములను ఇప్పుడే యోచించుకొని సత్పథమున జనుటకై కృతనిశ్చయులు కావలయును – అని ఈ ప్రకారముగ ఆ చోరశిఖామణి తనలో తాను వితర్కించు కొనుచుండెను.

కాని మాయ బలీయమైనది. ఘనవాసనలు తొలగుట కష్టము. అవి యున్నచోట మందవైరాగ్యములు పనిచేయవు. బహుకాలము చిత్తమున ఘనీభవించి యున్న పాపసంస్కారములు అకస్మాత్తుగ తొలగుట మాటలా?! అవి ఒక రాగాన జీవుని వదలవు. పెద్దల సహవాసముచే ఒకింత పరమార్థగంధము అంటినను అది నిలుచుట కష్టము. వాసనాప్రాబల్యముచే పాతసంస్కారములు జనులందు ఎగిరెగిరి పడుచుండును. అదేవిధముగ ఈ గజదొంగకును హరికథా శ్రవణముచే ఒకింత ధర్మబుద్ధి ఉదయించినను బహుకాలము చిత్తకుహరమున రూఢిపడియున్న దొంగబుద్ధి అతనిని పూర్తిగ విడువలేదు. అందుచే అతడొక నిశ్చయము కావించుకొనెను. "ఇప్పటికి నా జీవితమున ఎన్నివందల పర్యాయములో దొంగతనము చేసితిని. దొంగతనము పాపమను విషయము ఇపుడు ఖాయమైపోయినది. ఇకమీదట అట్టి పాపకృత్య మెన్నడును చేయరాదను సంకల్పముకూడ నాయందు కలుగుచున్నది. కాని పొరపాటు బహుకాలగ్రహపాటుచే అలవాటుగా మారి యున్నది. కాబట్టి ఒక్కసారిగా అమాంతముగ ఈ దుర్వ్యసనమును వదలలేకున్నాను. అందుచేత ఇప్పుడు ఒక్క పర్యాయము మాత్రము ఒకానొక పెద్దదొంగతనముచేసి ఇక మీదట దానిని పూర్తిగా మానివేసెదను. లోకమున అందరికంటె శ్రీమంతుడు రాజు. కాబట్టి నేటిరాత్రి రాజుగారి ఇంట్లో దొంగతనముచేసి, అదియే నా జీవితములో చివరి దొంగతనమని భావించి ఇకమీదట దానికి భరతవాక్యమును పలికెదను.

అని ఈ ప్రకారముగ నిశ్చయించి ఆ తస్కరశిరోమణి ఒక జ్యోతిష్కునియొద్దకు వెళ్లి "మహాత్మా! రాజుగారింటియందు దొంగతనము చేయుటకు ఒక చక్కని ముహూర్తమును, తాము నిర్ణయించి చెప్పవలెను. అందులకు యోగ్యమగు కట్నమును చెల్లించెదను"అని పలకగా జ్యోతిష్కుడు కన్నెఱ్ఱచేసి, "ఓయీ! మేము పెండిండ్లకు, గృహప్రవేశములకు లగ్నములు పెట్టువారమేకాని దొంగతనమునకు కాదు. నీ వాక్యములను ఎవరైన కొంపతీసి వినినచో నిన్ను, నన్ను కూడ శ్రీకృష్ణజన్మస్థానమునకు తీసికొని వెళ్ళెదరు. కావున ఇక నీ ప్రసంగమును కట్టిపెట్టి శీఘ్రముగ ఇచ్చోటు వదలి పొమ్ము" అని గద్దించి చెప్పెను. వెంటనే గజదొంగ జ్యోతిష్కుని చెవిలో ఏదియో రహస్యముగ చెప్పెను. ఆ మాటలు వినగనే జ్యోతిష్కుడు పరమానందముతో చిందులు తొక్కుచు తనయొద్దనున్న జ్యోతిష్య గ్రంథము లన్నిటిని తిరుగవేయదొడగెను. జ్యోతిష్కుని చెవిలో దొంగ చెప్పినది– "చెరిసగము స్వాహా" అను యుక్తి వాక్యము, అనగా "ఓ జ్యోతిష్కుడుగారూ! రాజుగారింట్లో దొంగిలించిన ధనములో నీకు సగం, నాకు సగం, ఆ వాక్యము వినగనే సిద్ధాంతి ఆనందడోలికలలో ఊగులాడుచు, తనకు రాజుగారి సంపదలో కొంతభాగము తప్పక రానున్నదని సంతసించి, తిథివారవర్జ్యములను లెక్కగట్టుచు ఒక చక్కనిముహూర్తమును నిశ్చయించి దొంగకు చెప్పెను. "నేటిదినము అర్ధరాత్రి 12 గం॥ల 9 నిముషములకు నీవు రాజుగారింట్లో ప్రవేశించినచో అద్భుతమగు కార్యసాఫల్యము సిద్ధించును." అని సిద్ధాంతి పలుకగా దొంగ ఆ సమయమును గుర్తుపెట్టుకొని వెడలిపోయెను.

అది నిశీథసమయము, అర్ధరాత్రి సమీపించుచుండెను. అంధకారము నలుదెసల దట్టముగా వ్యాపించియుండెను. రాజభవనమున అందఱును గాఢనిద్రలో నుండిరి. ఆ ముహూర్తబల మేమియోకాని, రాజప్రాసాదముయొక్క ద్వారపాలకులు కూడ అత్తఱి నిద్రలో తన్మయులై యుండిరి. అందుచే దొంగ నిరాటంకముగ లోనికి ప్రవేశింప గల్గెను. జాగ్రత్ప్రపంచముయొక్క స్పృహయే ఎవరికిని లేనందున దొంగ నిరాఘాటముగ తనపని సాగించుకొని పోవుచుండెను. తాను తెచ్చిన సంచుల నిండా బంగారపు పాత్రలను, విలువగల ఆభరణాదులను వేసికొని మూటగట్టు చుండెను. మరల ఇట్టి సుముహూర్తము, ఇట్టి మహదవకాశము దొఱకుట దుర్లభమని భావించి దొంగ చాలసేపు దొంగతనము చేయనారంభించెను. ఇంతలో తెల్లవారెను. రక్షకభటులు నిద్రలేచి దొంగను పట్టుకొనిరి. వానిని పాశములచే బంధించివైచి రాజుగారి యొద్దకు గొనిపోయిరి. నృపాలు డంతయు విచారించి వీపుపై బెత్తములతో నూఱుదెబ్బలు అతనిని కొట్టునట్లు ఆజ్ఞాపించెను.

రాజాజ్ఞ ననుసరించి భటు లాతనిని దూరముగ తీసికొని వెళ్ళి వీపుపై ప్రహారములు సల్పుచు దెబ్బలకు లెక్క పెట్టుచుండిరి. ఏబది దెబ్బలు తినినమీదట దొంగ భటులతో "ఓయీ! ఇక నన్ను కొట్టవద్దు. నా భాగస్థుడొకడున్నాడు. తక్కిన యాభైదెబ్బలు అతనిని కొట్టవలయును. మేము చేసికొనిన ఒడంబడిక ప్రకారము సగము ఆస్తి అతనికి దక్కవలెను!" ఆ వాక్యములను వినినతోడనే భటులు నివ్వెర పోయి, జరిగిన వృత్తాంతమంతయు తెలిసికొని, దొంగతనమునకు లగ్నము పెట్టిన జ్యోతిష్కుని చెవి మెలిపెట్టి అచటికి తీసికొనివచ్చి వీపు వంచి తక్కిన యాభైదెబ్బలు అతనిచే తినిపించిరి. పాపమార్గమును ప్రోత్సహించిన కారణముచే పాపఫలితమగు దుఃఖమును జ్యోతిష్కు డనుభవింప వలసివచ్చెను. (తరువాయి 13వ పేజీలో)



## మనం ప్రతి నిత్యం - భగవంతుని ముందు, నమస్కరించే - నమస్కారంలోని అంతరార్థం తెలుసుకొందాము!!!

మనం చేతులు జోడించి భగవంతునికి నమస్కరిస్తాము,

నమస్కారమంటే ఏమిటి???.... రెండు చేతులు జోడించి దండం పెట్టడం, అంటే

ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు కలిపి భగవంతునికి అర్పించటమే నిజమైన నమస్కారం...

"న" అనగా 'నాది' అని అర్థం,

"మః" అనగా 'కాదు' అని అర్థం...

నాది కాదు అంటే ఎవరిది ఇదంతా... నువ్వే అని అర్థం...

అంటే సర్వమూ భగవంతునిదే అన్న నిరంహకార భావానికి చిహ్నం నమస్కారం...

కర్మలను ప్రారంభించే ముందు మనము కర్మలకు నమస్కరించాలి...

"తస్మై నమః కర్మణే", 'ఓ కర్మ దేవతా! నాచే పవిత్రమైన కర్మలను మాత్రమే చేయించు' అని ప్రార్థించాలి...

నమస్కారం అంటే ఏదో రెండు చేతులు జోడించడం కాదు, తలపెట్టిన కర్మ విజయవంతం అయ్యేలా ఆశీర్వదించమని భగవంతుని ప్రార్థించడమే నమస్కారంనకు అంతరార్థం...

అలానే ... 'ఓం నమః శివాయ' అని పంచాక్షరి మంత్రము జపిస్తాము, దానిలో దాగివున్న నిగూడార్థం, ఏమిటి అంటే...

"నమః" నేను కాదు ... మరి ఎవరు???

అంతా "శివాయ" అంటే శివుడే అనే పరమార్థం... ఆ పంచాక్షరీ మంత్రములో దాగి ఉంది... ●

## అమ్మ ప్రేమ



అమ్మ ప్రేమ మీద కవిసామ్రాట్ విశ్వనాథ వారి పద్యం.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి శ్రీ మద్రామాయణ కల్పవృక్షం లోనిది ఈ పద్యము.

**తానో లాములు "తండ్రి పేరెవరయా"**
**దాచాత మాలాలు నౌ**
**లే! నాపేరన, నమ్మగాల గన, నోలిం దల్లి కౌసల్య తం**
**డ్రీ! నాగానన బోయిరాక, కనులన్ నీర్వెట్ట, కౌసల్య నే**
**గానేకానులె యమ్మనే యని ప్రభున్ గౌసల్య ముద్దాడెడిన్ !!**

తాత్పర్యము

చిన్ని రాముని కౌసల్య దగ్గరకు పిలచి

నీపేరేమిటి అని అడిగిందట. పసివాడైన రాముడు పసి భాషలో లాములు (రాముడు) అన్నాడట.

మరి మీ నాన్నగారి పేరేమిటి అంటే దాచాత మాలాలు (దశరథమారాజు) అని బాల రాముని జవాబు.

మరైతే నాపేరేమిటి అని కౌసల్య అడిగితే

అమ్మ గాలు (అమ్మ గారు) అన్నాడు.

కాదు నాయనా నాపేరు కౌసల్య

అని సవరించింది.

"కౌసల్య" అనేమాట పసి పిల్లాడికి పలుకడం

కష్టం. ఆ అసహాయతతో పసివాడు కంట నీరు పెట్టాడు .

తట్టుకోలేక కౌసల్య బాలరాముని హత్తుకొని

"కౌసల్య నేకాను" "నీ అమ్మనే" అంటూ

ముద్దాడింది.

ప్రతి బాలుడూ చిన్ని శ్రీరాముడై ప్రతితల్లీ

కౌసల్య వలె అనుభవానుభూతిని ఆస్వాదించాలని ఆశిస్తూ...


Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*


(12వ పేజీ తరువాయి)

**కర్తా కారయితా చైవ ప్రేరకశ్చానుమోదకః ।**
**జపుణ్యకార్యే పాపకార్యే చత్వార స్సమభాగినః**

అనునట్లు పుణ్యకార్యమందుగాని, పాపకార్యమందుగాని చేసినవాడు చేయించినవాడు, ప్రోత్సహించినవాడు ఆమోదించినవాడు నలుగురు గూడ సమానముగ ఫలితములను బొందుదురు. పుణ్యకార్య తత్పరుని సుఖమును సమానముగ పంచుకొందురు. పాపాచరణ శీలురు దుఃఖమును సమానముగ పంచుకొందురు. కథయందు దొంగతనము చేసిన గజదొంగ , మరియు దొంగతనమును ప్రోత్సహించిన జ్యోతిష్కుడు ఇరువురును శిక్షను సమానముగ అనుభవించిరి. కాబట్టి పాపకార్యముల నెవరును చేయరాదు. వానిని ప్రోత్సహించను రాదు. దుష్కర్మలయొక్క దారుణ ఫలితములను ముందుగనే ఊహించి ఆ పాపకర్మలకు శాశ్వతముగ తిలోదకము లొసంగవలెను. కర్మసిద్ధాంతము అప్రతిహతమైనది. కావున జీవుడు తాను చేయుకర్మ పవిత్రవంతమై, దైవగంధయుతమై, పాపరహితమై, పరోపకారయుక్తమై యుండులాగున చూడవలెను. అప్పుడే జీవితము చక్కగ రాణించును.

భగవదనుగ్రహమున్ను జీవునకు సంప్రాప్తమగును. మానవత్వము సార్థకమగుట కిట్టి సదాచారము జనులాశ్రయించవలెను. దుష్కృత్యములను ఏకాలమందును దరికి జేర్చరాదు. సంసారదుఃఖ మంతరించుట కిదియే ఏకైక మార్గము.

**నీతి:- పాపము యొక్క ఫలితము దుఃఖమని యెతిగి పాప కర్మము లవలేశమైనను చేయరాదు.** ●

# లక్షన్నర కవితలు రాసాను - పి.బి. శ్రీనివాస్



కాలంగలిల్ అవళ్ వసంతం అనే పాట ఎప్పుడు విన్నా మనల్ని స్వర్గానికి తీసుకుపోతుంది. ఎప్పటికీ ఆ మధురమైన గొంతుకి సొంతదారు పి.బి. శ్రీనివాస్.

PBS అనే పొడి అక్షరాలను Play Back Singer అని చెప్పుకోవచ్చు. తన మధురమైన స్వరంతో వినేవారిని కట్టిపడేస్తారు. తమిళం, తెలుగు, కన్నడం, మళయాలం, హిందీ తదితర భాషలలో పాటలు పాడటమే కాకుండా కవిగానూ తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్నారు.

ఈ ఇంటర్వ్యూ నాటికి ఆయన వయస్సు డెబ్బయ్ మూడేళ్ళు. మన తెలుగు వారైన పీబీఎస్ కన్నడంలో నటుడు రాజ్‌కుమార్‌కి పాడిన క్రమంలో ఆయన గాయకుడికే గాయకుడిగా ప్రసిద్ధికెక్కారు.

పీబీఎస్ గారిని తమిళనాడు ప్రభుత్వం ఇయల్, ఇసై, నాటక మండ్రానికి అధ్యక్షుడిగా నియమించిన సందర్భంలో ఓ తమిళ పత్రిక (2004లో) ఆయనను కలిసి ముచ్చటించింది. ఆ ఇంటర్వ్యూలో పీబీఎస్ గారు చెప్పిన విషయాలను కొన్నింటిని ఆయన మాటల్లోనే ఇక్కడ పొందుపరిచాను...

నేను"చిన్నతనంలోనే సంగీత కళాకాడినైనవాడిని. ఇందుకు మా అమ్మ ఆశీస్సులే కారణం. అమ్మ మంచి గాయని. స్వరశక్తి కలిగిన వారు. ఇంట్లో పాడు తుండేవారు. అమ్మ ఆశీస్సులే నన్ను సంగీతంలో పైపైకి ఎదగనిచ్చాయి. సినిమా పాటలను వింటూనే నన్ను నేను వృద్ధి చేసుకున్నాను. నాకు కర్ణాటక సంగీతం వద్దని ఆరంభంలోనే నిశ్చయించుకున్నాను.

ఎందుకంటే ఆనాడు కర్ణాటక సంగీతాన్ని చెప్పడానికి గురువుల విధానం నాకు బోధపడలేదు.

అయితే ఎం.ఎస్., డి.కె.పట్టమ్మాళ్, సెమ్మంగుడి, అరియకుడి, జి.ఎన్. బాలసుబ్రమణ్యం తదితరుల సంగీతాన్ని విన్న తర్వాతే నాకు కర్ణాటక సంగీతంపట్ల ఆరాటం కలిగింది.

పాడేవారు మంచిగా పాడితే సంగీతం బాగుంటుందని అర్థం చేసుకున్నాను. కర్ణాటక సంగీతాన్ని నేను క్రమపద్ధతిలో నేర్చుకోకపోయినప్పటికీ రాగాలు, తాళాలు అన్నింటినీ స్వయంగా నేనే గ్రహించి కొత్త కొత్త రాగాలను సృష్టించాను.

నేను సినిమాలో చేరడం మా నాన్నగారికి ఇష్టం లేదు. కానీ నాకేమో సినిమా అంటే ఓ ఆశ. ఆయన ఒప్పుకోలేదు. ఎందుకంటే సినిమాలో చేరితే అబ్బాయి చెడిపోతాడు అని ఆయన అనుకున్నారు. కానీ నాకేమో సినిమా తప్ప మరిదేనిమీదా ఆసక్తి లేదని చెప్పాను. వెంటనే మా నాన్న గారు "నువ్వు డిగ్రీ పూర్తి చేయి. ఆ తర్వాత చూద్దాం" అన్నారు.

నేను సినిమాలో చేరడంకోసం నా చదువుని ఓ తపస్సులో పూర్తి చేశాను. అనంతరం నన్ను ఓ జ్యోతిష్కుడి వద్దకు తీసుకుపోయారు మా నాన్నగారు. ఆయన నాన్నగారితో "మీకు రాసిస్తాను... ఇతను సినిమా రంగంలో అడుగు పెట్టడు" అని అన్నారు. అప్పుడు ఆయనను నేనడిగాను "మీరు చెప్పేది అక్షరాలా జరుగు తుందా?" అని. వెంటనే ఆయన "లేదు. కొన్ని సమయాలలో కొన్ని మార్పులు జరగవచ్చు" అన్నారు. నేనప్పుడు ఆయనతో "ఆ మార్పులలో నేనూ ఒకడిని" అన్నాను.


"ప్రయత్నిద్దాం. అది జరగకుంటే వదిలేద్దాం. కానీ నా శ్వాస ఉన్నంత వరకూ ప్రయత్నిస్తాను" అన్నాను.

నా జవాబు ఆయనకు నచ్చింది. వెంటనే ఆయన మా నాన్నగారితో "మీరు ఇతనిని సినిమాలో చేర్పించండి. ఇతనిలో తపన ఉంది. శక్తి ఉంది. భగవంతుడిని ప్రార్థిస్తాను. కచ్చితంగా ఇతను ముందుకు వస్తాడు" అన్నారు.

ఆ తర్వాత మా నాన్నగారు నన్ను జెమినీ స్టూడియోకి తీసుకుపోయారు. 1952లో మొదటిసారిగా నేను సినీ ప్రపంచంలోకి ప్రవేశించాను. పద్మశ్రీ ఈమని శంకరశాస్త్రి, పి.ఎస్. కలాన్ తదితరులు మిస్టర్ సంపత్ అనే హిందీ సినిమాలో నాతో పాడించారు. అది తమిళంలో మిస్ మాలిని అనే సినిమా. ఆ చిత్రంలో రెండు పంక్తులు పాడాను. ఇలాగే నా నేపథ్యగాన ప్రవేశం జరిగింది.

జెమినీలో ఎ.వి.ఎం.ఆర్. నాగేంద్రరావు ఆల్ రౌండ్ ఆర్టిస్టుగా ఉండేవారు. ఆయన జాతకం అనే సినిమాను తెలుగు కన్నడం, తమిళం భాషలలో నిర్మించారు. అప్పుడు జి.కె. వెంకటే నన్ను రాజ్ కుమారుని పరిచయం చేశారు. "మంచి గాత్రశక్తి గల ఈ యువకుడు నా మిత్రుడు. ఈయనకు మీ సినిమాలో ఓ అవకాశం ఇవ్వాలి" అని అడిగారు. వెంటనే రాజ్ కుమార్ కోకిలేశ్వరర్ అనే సినిమాలో నాకు పాడే అవకాశమిచ్చారు. ఆ సినిమాలో ఓ శ్లోకం, ఓ పాట పాడాను. నా పాట విన్న రాజ్ కుమార్ "వెంకటేష్, నువ్వు నాకొక మంచి నేపథ్య గాయకుడిని పరిచయం చేసావు" అని ప్రశంసించారు.



దీని తర్వాత భక్త కనకదాసా అనే సినిమా టి.ఆర్. నాయుడు రూపొందించారు. ఈ సినిమాకు సంగీతం ఎం.వి. రాజు సమకూర్చారు. ఈ సినిమాలో అన్ని పాటలూ కనకదాసువే. ఈ సినిమా సూపర్ హిట్టయ్యింది.

అప్పుడు రాజ్ కుమార్ "ఇక నా సినిమాలకు నేను పాడను. నాకోసం పి.బి. ఏనివాసే పాడుతారు" అని చెప్పారు. అరోజు నుంచి దాదాపు ఇరవై ఏళ్ళపాటు రెండు వందలపాటలకుపైగా నేను ఆయనకు పాడాను. ఈరోజు కన్నడ ప్రపంచంలో చనా గురించి చెప్పుకుంటున్నారంటే అందుకు కారణం రాజ్ కుమారే. అందువల్ల నేనాయనకు రుణపడి ఉన్నాను.

జాతకం అనే సినిమాతో తమిళ సినీ రంగంలోకి అప్పటికే అడుగుపెట్టినప్పటికీ ప్రేమపాశం సినిమాలో నేను సోలోగాను, పి. సుశీలతో కలిసి పాటలు పాడాను. కానీ నన్ను తమిళనాడు అంతటా పరిచయం చేసింది సిల్వర్ జూబ్లీ జరుపుకున్న పావమన్నిప్పు సినిమాలో నేను పాడిన కాలంగలిల్ అవళ్ వసంతం పాట తర్వాతే.

కన్నదాసన్ రాసి విశ్వనాథన్ రామమూర్తి సంగీతంలో నేను పాడిన ఆ పాటకు విశేష ఆదరణ లభించింది.

పావమన్నిప్పు సినిమాలో నేను జెమినీ గణేశన్‌కి పాడి అది పాపులర్ అవడానికి ముందే అంజలి పిక్చర్స్ వారి అదుత్త వీట్టు పెన్ సినిమాలో నేను చాలా పాటలు పాడాను. నేను, జానకి పాడిన ఓ పాట హిట్టయ్యింది జెమినీగణేశన్‌కి నేను ఎక్కువ పాటలు పాడలేదు. కానీ నేను ఆయన కోసం పాడిన అన్ని పాటలు సూపర్ హిట్టయ్యాయి.

కాలంగలిల్ అవళ్ వసంతం పాట ఎ.వి.ఎం. చెట్టియార్‌కి ఎంతగానో నచ్చింది. అప్పటి నుంచి ఆయన నన్నెలాగైనా హిందీ సినిమాలో పాడించాలనుకున్నారు. అందువల్ల చిత్రగుప్తుడితో ఓ నెల రోజులపాటు ప్రాక్టీస్ చేయించమన్నారు.

అయితే నేను పాడిన మొదటి సారే చిత్రగుప్తన్ ఓకే చెప్పేసారు. మైన్ బీ లడికి హూన్ అనే హిందీ సినిమాను చెట్టియార్ నిర్మించారు. నాతో ధర్మేంద్రకు పాడించాలనుకున్న తన కోర్కెను ఆయన సాధించుకున్నారు. ఈ సినిమాలో మీనాకుమారికి లతా మంగేష్కర్ పాడారు. నాకు చాలా కాలంగా లతాతో కలిసి పాడాలని కల. ఆ కల చెట్టియారుతో నెరవేరింది. నాకెంతో సంతోషం వేసింది. ఓమారు లతా సోదరి ఉషా పాడిన పాటలో దొర్లిన తప్పుని చెప్పాను. అది విన్న వి.ఎన్. శర్మాజీ చెన్నై నుంచి వచ్చిన ఇతను నాకు చెప్తున్నాడే అని ఆశ్చర్యపోయారు. ఆయన మళ్ళీ ఆ పాట విన్నారు. నేను చెప్పిన లోపాన్ని ఆయన మార్చారు. ఆ సంఘటన తర్వాత ఆయన కొన్ని హిందీ సినిమాలలో పాడేందుకు నాకు అవకాశ మిచ్చారు. నేను హిందీ సినీ జగత్తులోకి ప్రవేశించడానికి ఇదీ ఒక కారణమనొచ్చు.

నా గొంతు లతాకి నచ్చడంతో నన్ను దాదాపు 15, 16 హిందీ సంగీత దర్శకులకు సిఫారసు చేసారు. కానీ నేను హిందీలో ఎక్కువగా పాడలేదు. తర్వాత తమిళ, కన్నడం పాటలు పాడాను. దక్షిణాది భాషలలో నేను ఎక్కువగా తమిళం, కన్నడంలలో పాడాను. తెలుగు, మళయాలంలలో కాస్త తక్కువ పాడాను.

నేనిప్పటివరకు ఎనిమిది భాషలలో అనేక పాటలు, కవితలు రాశాను. ఇప్పటివరకు లక్షన్నర కవితలు రాశాను.

నేను పాడిన శారదా భుజంగ స్తోత్రం, సంస్కృత భక్తి పాటలు, పురంధర దాస్ పాటలు, శ్రీ వేంకటేశ సుప్రభాతం, ముకుందమాల, మళయాలంలో నైవేద్యం, శివపరివార స్తోత్రం ఇలా ఎన్నింటినో పాడాను. వీటికి మంచి ఆదరణ లభించింది.

ఛందస్సు అనే శీర్షికతో కవితా వ్యాకరణం గురించి రాసాను. శ్రీనివాస గాయత్రీ వృత్తం, చిత్రకవిత పద్ధతిలో దశ గీత గీతా సందేశం (Dasa Geetha Geetha Sandesam) అనే పుస్తకాన్ని ప్రచురించాను. ఇది వీణ గాయత్రితో కలిసి పాడాను. అంతేకాకుండా

'Man has set his foot on Moon' అనే EP గ్రామఫోన్ రికార్డుని అమెరికా అధ్యక్షుడు నిక్సన్‌కి, నీల్ ఆర్మ్ స్ట్రాంగుకీ పంపాను. వారు ప్రశంసిస్తూ నాకు ఉత్తరాలు రాశారు. ఎంతో ఆనందమేసింది. అందులో "man to moon... moon to god" అని రాసాను. అంతేకాకుండా లవ్లీ లవ్ సాంగ్స్, వైట్ షాడోస్, గాయకుడి గేయాలు, ప్రణవంఅనే పుస్తకాలూ ప్రచురించాను.

ఎనిమిది భాషలలో వేలాది గజళ్ళు రాసి స్వరపరిచాను. వీటిలో ఎక్కువ శాతం ప్రేమగీతాలే. సోలోగా కొన్ని పాడాను. ఈ.వి.ఎస్. దేవి రామమూర్తితో కలిసి మరికొన్ని పాడాను. వీటికీ మంచి ఆదరణే లభించింది. నాతో పాడిన దేవి ఈమని శంకర శాస్త్రిగారి కుమార్తె.

కర్ణాటక సంగీతాన్ని ఓ క్రమపద్ధతిలో నేర్చుకోకున్నా ప్రముఖుల సంగీత విద్వాంసుల పాడే తీరును క్షుణ్ణంగా వింటూ నా సంగీత జ్ఞానాన్ని పెంచుకున్నాను.

నవనీత సుమ సుధా అనే రాగాన్ని సృష్టించాను. ఈ రాగానికి జన్యరాగ జన్యం అని పేరు పెట్టారు జి.ఎస్. మణి. ఎందుకంటే సరస్వతి రాగం పాడేటప్పుడు ఏర్పడిందే ఈ రాగం.

"నవనీత సుమ సుధ" రాగం అనేది...

న – నవరస కానడా
వ – వసంత
నీ – నీతిమతి
త – తపస్విని
సు – సువర్ణముఖి
మ – మలయమారుతం
సు – సునాదవినోదిని
ధ – ధన్యాసి

ఈ ఎనిమిది రాగాల మొదటి అక్షరాలను కలిపితే ఏర్పడినదే నవనీత సుమ సుధ రాగం.

అలాగే చిత్రకవిత నడకలో వాగ్గేయకారుడు త్యాగరాజు గురించి కీర్తనలు రాశాను.

Music అనే పదంలో మొదటి అక్షరం M మెలోడికి సంకేతం. మనం ఈ మాటలో Mu తీసేస్తే "sic" అయిపోతుంది. కనుక సంగీతానికి లయ చాలా ముఖ్యం.

మా పిల్లలందరికీ బాగా పాడుతారు. మా అక్కయ్య కొడుకు వి.జి. మధుసూదన్ నాతో పలు వేదికలపై పాడాడు. అతను నాలాగే పాడతాడు. నా వారసుడిగా అతనిని చెప్పుకోవచ్చు. నా పాత పాటలను అతను పాడగా రికార్డు చేసి ఎం.ఎస్. విశ్వనాథన్‌కి పంపాను. అవి విన్న విశ్వనాథన్ "మీరు పిడినవేగా" అన్నారు.

అవి నేను పాడలేదు... నా మేనల్లుడు పాడాడు అనగానే ఆయన ఆశ్చర్య పోయారు. నా మనవడు ఆనందవర్ధన్ మృదంగం, వేణువు వాయిస్తాడు. నా సోదరుడు రామానుజం బాగా పాడేవారు. నా సోదరి కొడుకు బాబు, నా రెండవ సోదరి కుమార్తె లక్ష్మి కూడా పాడుతారు.

– **యామిజాల జగదీశ్**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# అమెరికా వర్జీనియాలో వ్యవసాయం చేస్తున్న తెలుగు మహిళ

వర్జీనియా లౌడెన్ కౌంటీలో ఓ స్కూలు. ఆడిటోరియం కిటకిటలాడుతున్నది. అందరికీ బుక్‌లెట్స్ పంచారు. విద్యార్థుల్లో ఆ బుక్‌లెట్‌లో ఏముందో అన్న చర్చ. ఇంతలో 20 నిమిషాల నిడివిగల ఒక వీడియో ప్రదర్శించారు. విద్యార్థులంతా ఐదో తరగతి చదివే సాహితి వైపు చూస్తూ.. 'విశాలి మీ అమ్మనా?' అని అడగడం మొదలుపెట్టారు. 'ఔను.. మా అమ్మే. తను రైతు' అని గర్వంగా చెప్పింది సాహితి. స్థానిక ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ఏకైక భారతీయ రైతు విశాలి! సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే మూలాల మీద ప్రేమతో రైతుగా మారిన నవిశాలి కొణతం సాగు సంగతులు ఆమె మాటల్లోనే...

లౌడెన్ కౌంటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్‌వారు ప్రతి సంవత్సరం పదిమంది రైతులను నామినేట్ చేస్తారు. ఈ ఏడాది ఆ జాబితాలో ఉన్న ఏకైక భారతీయ రైతు నేనే. వ్యవసాయం కూడా ఒక వృత్తే అని తెలియ జేయడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. దీంట్లో భాగంగా బుక్‌లెట్స్ ముద్రించి పాఠశాలల్లో పంచుతారు. వీడియోలు ప్రదర్శిస్తారు. నామినేట్ అయిన రైతు విద్యార్థులను వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లి లోకల్ ఫుడ్ ప్రాధాన్యాన్ని వివరిస్తారు. మా చిన్నపాప సాహితి స్కూల్లో కూడా ఈ కార్యక్రమం చేశారు. నా బుక్‌లెట్స్, వీడియో చూసి విద్యార్థులు 'సాహితీ! మీ అమ్మ విశాలి గ్రేట్' అన్నారట. చాలా గర్వంగా చెప్పింది మా సాహితి.

మేము ఉండేది వర్జీనియాలోని లౌడెన్ కౌంటీలో. ఐటీ ఫీల్డ్‌లో ఉన్నాను. ఏడేండ్ల క్రితం మా పెరట్లో కూరగాయల సాగు మొదలుపెట్టాను. భారతీయ కూరగాయలన్నీ పండిస్తున్నా. అది కాస్తా వ్యవసాయం దాక తీసుకొచ్చింది. కొంత భూమిని లీజ్‌కు తీసుకొని మార్చిలో పని మొదలుపెట్టాను. భూమికోసం ఎక్కడెక్కడో తిరిగాం. ఎక్కడ బోర్డ్ కనిపిస్తే అక్కడికి వెళ్లేవాళ్లం. ఎకరా విస్తీర్ణంతో మొదలైంది మా సాగు. వచ్చే సంవత్సరం ఐదెకరాలకు విస్తరించే ఆలోచన ఉంది. మా పొలంలో కాడ కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాం. మా ఫామ్ పేరున స్ప్రౌటింగ్ రూట్ ఫామ్, ట్యాగ్‌లైన్ A Dream to go back to the Roots.

**ఫామ్ టు హోమ్**

మా పంటను రెస్టారెంట్లకు, స్టోర్లకు ఇవ్వొద్దనీ.. ఫామ్ టు హోమ్ కస్టమర్లకే అందించాలనీ ముందే అనుకున్నాం. సేంద్రియ పద్ధతిలో ఓ భారతీయ రైతు పండిస్తున్న కూరగాయలని తెలియగానే నేరుగా పొలం దగ్గరికే వస్తున్నారు. వాళ్లే తెంపుకొంటున్నారు. పొలాల్ని చూస్తున్నారు. డబ్బు ఎనభై కుటుంబాలు మా దగ్గర కూరగాయలు తీసుకెళ్తాయి. ఆర్డర్ చేస్తే హోం డెలివరీ చేస్తాం. అదికూడా చుట్టుపక్కల మాత్రమే.

**వ్యవసాయంపై ఇష్టంతో**

మాది మోత్కూరు దగ్గర ఆరెగూడెం. మా నాయిన బక్కారెడ్డి. ఎన్ని సమస్యలొచ్చినా వ్యవసాయాన్ని వదల్లేదు. నాకు బాగా గుర్తు. నాయినెప్పుడూ వ్యవసాయంతో వేలకు వేలు సంపాదించింది లేదు. అయినా సేద్యమంటే ఇష్టం. నాయినకు ఇష్టమైన పనుల్లో ఏదో ఒకటి కొనసాగించాలని అనుకునేదాన్ని. లౌడెన్ కౌంటీలో ఇల్లు తీసుకొని అచ్చం మా ఊర్లో నాయిన డిజైన్ చేసినట్లుగానే ఇంటి వెనక కూరగాయలు, ఇంటిముందు పూల మొక్కలు పెట్టాను.

**మూలాలకు దూరం కావద్దు**

నేను వ్యవసాయం చేస్తానని చెప్పగానే ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. ఇక్కడ సేద్యం అంత సులభం కాదు కూడా. కానీ నేను పట్టువీడలేదు. నా ఆలోచనకు మావారు ఏథర్, మా పెద్దక్క బిడ్డ అర్చన మద్దతు లభించింది. మా ఆయనది కూడా వ్యవసాయ నేపథ్యమే. మా అత్తమ్మ, మామయ్య ఇప్పటికీ వ్యవసాయంలోనే ఉన్నారు. అయితే రైతు పరిస్థితి రోజురోజుకూ దీనంగా మారడం చూసి వ్యవసాయంపై కోపం పెంచుకున్నారు. ఆ కోపమంతా నేను వ్యవసాయంలోకి దిగిన తర్వాత తగ్గిపోయింది. మా అమ్మాయిలు కూడా నన్ను, వ్యవసాయాన్ని అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు. నేను వాళ్లకు వ్యవసాయాన్ని మాత్రమే కాదు మన మూలాల్ని కూడా పరిచయం చేస్తున్నా.

**సేంద్రియ పద్ధతిలోనే**


మేం భారీగా పెట్టుబడి పెట్టలేదు. గ్రీన్‌హౌజ్ లాంటి వాటి జోలికి పోలేదు. లీజ్ ఒక్కటే పెద్ద వ్యయం. కలుపు రాకుండా షీట్స్ వేయించాను. డ్రిప్ సిస్టమ్, కంపోస్ట్ వంటి వాటి కోసం పోయినేడాది కూరగాయలతో సంపాదించిందంతా ఖర్చు పెట్టాను. పంటలన్నీ సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నాం. మా ల్యాండ్ ఓనర్‌కు అగ్రికల్చర్ స్కూల్ ఉంది. అక్కడ మేం విద్యార్థులకు సాగు గురించి బోధించే అవకాశం ఇచ్చారు. ఆ స్టూడెంట్స్ మా ఫామ్‌కు వచ్చి ఏ పంట ఎలా సాగు చేయాలో తెలుసుకుంటున్నారు.

**పొద్దున లేస్తే పొలం కాడనే**

పొద్దున తొమ్మిదింటి నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆఫీస్ పని. తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ల్యాప్‌టాప్ ఓపెన్ చేయను. పొద్దున ఐదింటికే పొలం దగ్గరికి వెళ్తా. ఇంటికొచ్చే వరకు ఎనిమిదిన్నర అవుతుంది. తొమ్మిదింటికి ఆఫీస్ పని స్టార్ట్ చేస్తాను. ప్రతీది ప్లాన్డ్‌గా చేస్తున్నాం కాబట్టి వ్యవసాయం విజయవంతంగా సాగుతున్నది. వీకెండ్స్‌లో శనివారం మొత్తం అక్కడే ఉంటాం. భవిష్యత్‌లో డెయిరీ పెట్టడంతోపాటు, సీజనల్ పండ్లు పండించాలని అనుకుంటున్నా. ఫామ్ దగ్గరే ఒక స్టోర్ పెట్టే ఆలోచన కూడా ఉంది.

సేకరణ

# పరోపకారం



భగవంతుడు ఎందుకు అవతార స్వీకారం చేస్తాడన్నది ప్రశ్న. ఆయన కేమి అవసరమంటే ధర్మ స్థాపన మరియు పరోపకారం కోసమే భగవంతుడు అవతారాలు స్వీకరిస్తాడు. తాను స్వీకరించిన అన్ని అవతారాలలో దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, అధర్మాన్ని నిర్మూలించి ధర్మాన్ని రక్షించాడు. ఇదంతా దేనికి అంటే లోకానుగ్రహం కోసమే. భగవంతునికి వేరే ఏమీ సాధించవలసిన అవసరంలేదు. భగవంతుడే పరోపకారానికి ప్రాధాన్యత నిస్తే మనమెంత ప్రాధాన్యమివ్వాలి? మన పూర్వీకులు దీని గురించి ఉదాహరణగా చిన్న శ్లోకంలో చెప్పారు.

परोपकृतिकैवल्ये तोलयित्वा जनार्दनः ।।
गुर्वीउपकृतिं मत्वा अवतरान्दश अग्रहीत् ।।

పరోపకారం చేయటం ఉత్తమమా లేక ఊరికే ఉండటం ఉత్తమమా అని తులనాత్మకంగా పరిశీలించి భగవంతుడు పరోపకారమే ఉత్తమమని భావించి అవతారాలు స్వీకరించాడు. అలా భగవంతుడే పరోపకారానికి ప్రాముఖ్యత నిచ్చాడు. పరోపకారం పరమోత్తమం, పరపీడనం నికృష్టం. రాక్షసులు పరపీడనంలో గడిపేవారు. అందువలననే వారిని భగవంతుడు సంహరించాడు.

మానవులు రాక్షసుల గుణగణాలను అలవరచకోకూడదు. ఇతరులకు ఎప్పుడూ సహాయపడే లక్షణం కలిగియుండాలి. మనకు వీలైనంత సహాయం చేయాలే తప్ప పరులకు అపకారం తలపెట్టకూడదు. అట్టి స్వభావం ఏర్పడితే మన జీవితం ధర్మబద్ధంగా ఉంటుంది. మనం ధర్మానుయాయులం అవుతాం.

జగద్గురు శ్రీ శంకర భగవత్పాదులు కూడ అధర్మాన్ని నాశనంచేసి ధర్మాన్ని రక్షించి లోకోపకారం చేయటానికే అవతరించారు. అందువలన మన పూర్వ జన్మ పుణ్యంగా లభించిన మానవజన్మ సార్థకతకై ధర్మాచరణ చేద్దాం. ధర్మాచరణ అంటే విచక్షణతో కూడిన పరోపకారమే. ప్రతియొక్కరూ ఈవిషయాన్ని గ్రహించి తమ జీవితాలను పవిత్రవంతం చేసుకోవాలి.

।। हर नम) पार्वती पतये हरहर महादेव ।।

– జగద్గురు శ్రీ శ్రీ భారతీ తీర్థ మహాస్వామివారు

# తల్లి సాత్వికురాలైనా పిల్లలు ఆవేశపరులౌతున్నారు ఎందుకు...

ఇది మన సనాతన ధర్మం చెబుతున్నది.

మనవారు దీన్ని ఎప్పుడో మరిచారు.

వంటచేయడం వడ్డించడం ఒక వరం.

అయితే అది ఇప్పుడు ఒక కళగా మారింది.

వంట ఇల్లు ఒక దేవాలయంగా వుండేది.

పొయ్యి వెలిగించడం అంటే అగ్ని హోత్రం వెలిగించడమే... అది భక్తిగా... భగవంతుని తలుస్తూ నేను చేయబోయే పదార్థాలు మా ఇంట్లో సభ్యులందరికీ ఆకలి తీర్చి ఆరోగ్యం చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ వంట చేయాలని పెద్దలు చెబుతారు.

అందుకే మన పూర్వీకులు ఏదో ఒక పారాయణం చేస్తూ వంట చేసే వారు. (గణేశ పంచకం, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామం లేదా భక్తి పాటలు పాడుకుంటూ వంటను ముగించేవారు.)

వంట చేసిన వారి మనస్థితి తిన్నవారిపై కూడా ప్రభావం చూపుతుంది అంటారు. దీనికి ఒక కథ కూడా ఉంది.

ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను మహా నిష్ఠాగరిష్ఠుడు... అతనింట్లో దేవతార్చన, అతని కుల వృత్తి తప్ప అతనికి ఏం తెలియదు. ఒక రోజు ఆ ఊరి జమీందారు గారు ఈ బ్రాహ్మణుడిని తమ ఇంటికి భోజనానికి పిలిచారు. పాపం ఎప్పటి లాగే ఆయన భోజనానికి వెళ్ళారు. ఏనాడు లేనిది ఆరోజు ఆయనకు తాను భోంచేస్తున్న అరిటాకు పక్కన పెట్టిన వెండి గ్లాసు మీదకు మనసు పోయింది. భోంచేస్తున్నాడన్న మాటే కానీ చూపు గ్లాసు మీదే ఉంది. చివరకు భోజనం చేయడం పూర్తి అయ్యింది... చేయి కదుక్కోవడానికి గ్లాస్ తీసుకుని వెళ్ళి చేయి కడుక్కుని ఆ గ్లాస్‌ని తన చేతి సంచీలో వేసుకున్నాడు.

ఆ తరువాత జమీందారు గారు ఇచ్చిన దక్షిణ తాంబూలాదులు తీసుకుని ఇంటికి తిరిగి వచ్చాడు. కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్ళి కూచున్నాక భార్య ఇచ్చిన దాహం పుచ్చుకున్న వెంటనే అతను స్పృహలోకి వచ్చాడు. తాను చేసినది దొంగతనం అని తనను ఎవరో ఛెళ్ళున కొట్టినట్టు అయ్యింది. వెంటనే చేతి సంచీ భుజాన వేసుకుని భార్యతో కూడా చెప్పకుండా పరుగు పరుగున జమిందారు గారింటికి వెళ్ళాడు.

ఇప్పుడే వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చిన బ్రాహ్మణుడిని ఆశ్చర్యంగా చూస్తున్న జమీందరుని చూసి "అయ్యా మీ ఇంట్లో వండిన పదార్థాలకు కావలసిన వస్తువులను కూరగాయలతో సహా ఎలా సేకరించారు. మీ వంట మనిషేమయినా మారారా? వేరే వంటవారు వచ్చారా?" అని అడిగాడు.

ఆయన భార్యను పిలిచి అడిగాడు.

"అవునండి నెలరోజులయ్యింది" అని చెప్పింది.

"ఆర్యా! ఏం జరిగింది?" అనడిగిన జమీందారుకు

"అయ్యా! ఎన్నడూ లేనిది మీ ఇంట నేను దొంగతనం చేసాను... నాకు ఎందుకు ఆ బుద్ధి పుట్టిందో తెలీదు. ఇంటికి వెళ్ళి నా భార్య చేతి మంచి నీరు తాగాక నేను స్పృహలోకి వచ్చి జరిగిన తప్పు తెలుసుకుని వచ్చాను..."

"మీ వంట మనిషి మీ ఇంట దొంగతనం చేస్తున్నదేమో గ్రహించండి... అటువంటి మనిషి చేతివంట తిన్న నా బుద్ధి వక్రీకరించింది." అని చెప్పడంతో వారు వంట మనిషిని పిలిచి గట్టిగా అడగడంతో ఆమె తప్పు ఒప్పుకుని వంట సరుకులను కూరగాయలను తన ఇంటికి దొంగతనంగా చేర వేస్తుండడం ఒప్పుకుంది.

వెంటనే వారు ఆమెను పని నుండి బహిష్కరించారు. బ్రాహ్మణుడు తాను దొంగిలించిన వస్తువును వారికి తిరిగి ఇచ్చి క్షమించమని అడిగి తిరిగి ఇంటికి వెళ్ళాడు.

వంట చేసే వారి ప్రభావం వారి మీద ఎంత ఉంటుందో తెలుసుకోవాలి.

అతిథి దేవో భవ అన్నారు..

ఏదో అలా వంట చేసి అందమైన టేబుల్ మీద అందమైన పాత్రలలో సర్దడం కాదు. నేలమీద అరిటాకులో వడ్డించినా మంచి మనసుతో వండి వడ్డించడం అవసరం. అలాగే చాలా మంది ఇంట్లో ఎంగిళ్ళకు ప్రాధాన్యత ఇవ్వరు. తిన్న కంచంలో మిగిలినది కూడా వంటలో కలపడం , తింటున్న కుడిచేత్తో మారు వడ్డించుకోడం. ఒకరి పళ్ళెంలో నుండి ఒకరు తీసుకుని తినడం ఫ్రిజ్‌లో బాటిల్‌ని నోటికి కరిచిపెట్టుకుని తాగడం ఇలా చాలా ఉంటాయి. నేను కళ్ళతో చూసాను.. వచ్చే వారు నిష్ఠాగరిష్ఠులైతే వారికి ఎంగిలి పెట్టిన పాపం ఊరికే పోదు.. అందుకే నియమంతో ఉండే వారు ఎవరూ వేరే వారి ఇంట్లో వేరేవారి చేతిమీద వీలైనంతవరకు తినకపోవడమే మంచిది.. నేడు రోడ్డు మీద ఎవరు వండినదో తినడం ఎక్కువయ్యింది. సుచి శుభ్రతను ఎవరు పాటించటంలేదు. అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నంను దైవ సమానంగా చూడాలంటారు. నేను కొన్ని సంవత్సరాలక్రితం అగస్త్య ఆశ్రమంలో అన్నదాన సేవకు వెళ్ళేవాడిని అప్పుడు మా గురువుగారి ఆజ్ఞ ప్రకారం బియ్యం శుభ్రపరచడం, కాయగూరలు నరకడం, రోలు దంచడం పనులప్పుడు భగవన్నామం చెపుతూనే ఆ పనులన్ని చేసేవారం. ఇప్పుడీ అలవాట్లన్నీ తప్పాయి, సగం మందికి ఇవి చాదస్తంగా అనిపిస్తున్నాయి, మిగతా సగానికి నమ్మకం లేదు. మార్పు రావాలి ఓర్పుతో నిరీక్షిద్దాం. ●

## శ, ష, స అనే అక్షరాలు ఎలా పలకాలో తెలియని కొందరు దీనిని గమనిస్తారని ఆశ.

**యద్యపి బహునాధీషే తథాపి పఠ పుత్ర వ్యాకరణమ్**

**స్వజనః శ్వజనో మా భూత్ సకలం శకలం సకృత్ శకృత్**

**భావం:** నాయనా! నీవు ఎక్కువ చదవకపోయినా పర్వాలేదు, వ్యాకరణం మాత్రం నేర్చుకో. ఎందుకంటే స్వజన అనగా (మన వాళ్ళు) అన్న శబ్దాన్ని శ్వజన అంటే (కుక్కలు) అనకుండా, సకలం అనగా (సర్వం) అన్న శబ్దాన్ని శకలం అంటే (ముక్కలు) అని పలకకుండా, సకృత్ అనగా (ఒకసారి) అన్న శబ్దాన్ని శకృత్ అంటే (మలము) అని పలకకుండా ఉండడానికే కాక తదితర పదాలను కూడా సక్రమముగా పలకడానికి ఉపయోగపడుతుంది అని ఒక తండ్రి తన కుమారునికి చెబుతున్నాడు.

నాగరిక ప్రపంచం –

కళ్ళని–కల్లు

శిరీష–షిరీష

వేళ–వేల

కళ–కల

పళ్ళు–పల్లు

కాళ్ళు–కాల్లు

ఇంకా ఎన్నెన్నో.....అపస్వర శబ్దాలు.....వినలేని అపస్వరాలు..ముఖ్యంగా టీవీల వల్ల..

వ్యాకరణం తెలియనివారు ఏ అక్షరం ఎలా ఉచ్చరించాలో తెలుసుకోలేరు. ఉచ్చారణ సరిగా లేకపోతే వారు తలంచిన అర్థం రాకపోగా విరుద్దార్థం వస్తుంది – అని భావం.

అందుకనే, వ్యాకరణ సిద్ధి ఉంటేనే, వాక్ శుద్ధి వస్తుంది .మన నాలుక శుభ్ర పడుతుంది. వాగ్దేవి కరుణా ప్రవాహం అపారంగా లభ్యమవుతుంది.

అందుకనేనేమో పవన సుతుడు శ్రీ హనుమ, శ్రీ సూర్య నారాయణుని సన్నిధి లో సకల విద్యలు నేర్చుకొని, నవ వ్యాకరణ విద్యను అభ్యాసానికి

వివాహముచేసుకొని (వివాహితుడే అర్హుడు కనుక) నవ వ్యాకరణ పండితుడై, భవిష్యత్ బ్రహ్మగా ప్రకటించబడ్డాడు.

మాతృభాషలో మాధుర్యాన్ని నింపండి??

తెలుగు వారికి పురాణ గ్రంథమైన పెద్ద బాల శిక్ష దొరకటం మహా పుణ్య ఫలం.. ఆ మహాగ్రంథం చదివిన పెద్దలు, పిల్లలూ మహా జ్ఞానులవుతారు.. అందులో వ్యాకరణ సంపద అపారంగా లభిస్తుంది.. తప్పక చదవండి.??



(గోటేటి వేంకటేశ్వరరావు)

# ఒక ధ్యేయంతో కృషి చేస్తే, నేడు కాకపోతే రేపైనా విజయం తథ్యం. - స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

**2018** నవంబర్ 23 నాన్నగారు నిర్యాణం తరువాత ప్రముఖాంధ్ర పత్రికను నిలుపకూడదని ధృడ సంకల్పంతో ముందుకు వెడుతూన్న సమయంలో అనుకోని సంఘటనలు కొన్ని చోటు చేసుకున్నాయి, అందరికి తెలిసున్న కోవిడ్ మహమ్మారి, ప్రపంచాన్ని అతలాకుతలం చేసేసింది. అందరి వ్యాపారాలలోను కాస్త వెనుకబాటు, అందరిలాగే నాకూను, ప్రెస్ చాలా ఇబ్బంది, బిజినెస్ చతికిలబడింది, అయినా ఎలాగోలాగ గెంటుకుంటూ వస్తున్నాను, డాక్టర్ ఇందిరాదత్ గారు అందించిన సాయం, ఎప్పుడూ ప్రముఖాంధ్రకు మేమున్నాం అంటూ నాన్నగారిపై ప్రేమాభిమానలున్న, గోపురం కుంకుం అధినేత శ్రీ హరికృష్ణ గారు, అజంతా శ్రీ శంకరరావుగారు, క్రమం తప్పకుండా ప్రముఖాంధ్రకు తమవంతు సాయాన్ని అందిస్తూనే వున్నారు, హరికృష్ణ గారైతే ఏవిటి రాలేదు బిల్లు పంపించండంటూ చెక్కును పంపించారు. ఇదివరలో రెగులర్‌గా సపోర్ట్ చేసిన వారిని కాస్త సాయం చెయ్యండి అంటూ అడగలేకపోతున్నాను.

ఈ నెల నుండి అందరితోను ఉత్తరాలలో పలకరిస్తాను, ఇదంతా రాస్తూంటే నాకో కథ గుర్తొస్తోంది, మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

**వాక్చాతుర్యం**

సాహితీ సంగీతప్రియుడైన భోజరాజ చక్రవర్తిని దర్శించడానికి ఒక పేద పండితుడు చాలా రోజులుగా ప్రయత్నిస్తూ వచ్చాడు. కానీ కోట కావలి భటులు యేవో కారణాలు చెప్తూ అడ్డుకుంటూ వచ్చారు. ఒకనాడు భోజరాజు ఊరిలోని దేవాలయం దర్శించడానికి వెళ్ళిన సమయంలో ఆ పండితుడు కూడా ఆలయానికి వెళ్ళాడు. అక్కడి ఆలయంలోని వారందరికీ ఆ పండితుడన్నా, ఆయన పాండిత్యం అన్నా అపారమైన గౌరవాభిమానాలు వున్నాయి మహారాజు పరమేశ్వరుని స్తుతిస్తుండగా, ఈ పేద పండితుడు మహారాజు వెనుకగా నిలబడ్డాడు. అర్చకుడు దేవుడికి ఆరతి ఇస్తున్న సమయంలో ఆ పండితుడు గట్టిగా "గర్భగుడిలో పరమశివుడు లేడు" అని అరిచాడు.

వెనక నుండి వచ్చిన అరుపు విని మహారాజు ఉలిక్కిపడ్డాడు. పండితుని వేపు వెనక్కి తిరిగి చూసి "ఎందుకు అలా చెప్తున్నారు? దేవుడిని దూషించడం తప్పు" అన్నట్టు ఖండిస్తూ అడిగాడు.

అందుకు ఆ పండితుడు "చాలా కాలం క్రితమే శంకరుడు తన దేహంలో సగం నారాయణునికి యిచ్చి శంకరనారాయణుడైనాడు. మరియొక సగాన్ని ధర్మపత్నికి యిచ్చి అర్ధనారీశ్వరుడైనాడు. అందుకే ఆయన చిహ్నంగా ఏదీ లేదని అంటున్నానన్నాడు.

"ఆయన శిరసున గంగ వున్నది కదా.." అని భోజరాజు అడిగాడు.

"గంగ సముద్రంలో కలిసి పోయింది." అన్నాడు పండితుడు.

వెంటనే మహారాజు ఝటాఝూట అలంకారమైన చంద్రుడు ఏమయ్యాడు? అని అడిగాడు. "చంద్రుడు ఆకాశంలోకి వెళ్ళి ఇప్పుడు అక్కడే వున్నాడు." అని అన్నాడు పండితుడు.

అప్పుడు భోజరాజు "అవేవీ లేకపోయినా ఆయన శక్తి మాత్రం తప్పకుండా వుంటుంది." అన్నాడు.

"అది కూడా లేదు. తన శక్తినంతా మీకు యిచ్చివేశాడు..." అని అన్నాడు పండితుడు.

పండితుని నిందా చమత్కార సంభాషణ విని భోజమహారాజు, చిరునవ్వుతో "అన్నీ పోయినా కూడా ఆయన భిక్షాపాత్ర మాత్రం తప్పక ఆయన వద్దనే వుంటుంది" అన్నాడు.

పండితుడు అప్పుడు "ప్రభూ... అది కూడా యిప్పుడు ఆయన వద్ద లేదు. దానిని పరమేశ్వరుడు నాకు యిచ్చివేశాడు."

ఈ సంభాషణ విన్న భోజరాజుకు పండితుని పేదతనం అర్థం అయింది. ఆ పండితునికి ధనధాన్యాలు, అగ్రహారాలు దానం చేశాడు.

ఆ పండితుని కావ్యాలకు తగిన ప్రచారం చేయించాడు.

ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా తనలోని ప్రతిభను ఇతరులకు తెలియజెప్పడానికి తగిన లౌక్యం, వాక్చాతుర్యం కావాలి. తన వ్యక్తిత్వానికి భంగకరం కాకుండా తన గురించి తానే పొగుడుకోకుండా తన గురించి చెప్పకనే అవతలివారు తెలుసుకోగల బుద్ధి సూక్ష్మత కావాలి. అలాటివారు ఏ మూలనున్నా రాణిస్తారు.

– కాస్త నాకు వాక్చాతుర్యం తక్కువే, దానికి కాస్త బిడియం కుడా తోడయ్యింది. అడిగితే కాని అమ్మకయినా తెలియదు కదా, పైగా నేను చేసేది స్వలాభాపేక్ష కుడా కాదు. ప్రముఖాంధ్ర విషన్, మిషన్ తెలుగువారే. భాష, సంస్కృతి, సాంప్రదాయం, ఆధ్యాత్మికమే. ఇవి చెప్పే అతి తక్కువ పత్రికలలో ప్రముఖాంధ్ర ఒకటి.

కాబట్టి సాయం చెయ్యండి, మాతో నిలబడండి, మీ సహాయ సహకారాల్ని అందించండి. ●

# తెలుగు బ్రాహ్మణ మహాసభ సేవలు ప్రశంసనీయం



తెలుగు బ్రాహ్మణ మహాసభ ,వధూవరుల పరిచయ వేదికలో సంధ్యావందనం పుస్తకాన్ని తన సభ్యుల కోసం వెలువరించి విడుదల చేసింది. గత మూడున్నర దశాబ్దాలుగా ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నది. పేద బ్రాహ్మణ మహిళకు మాంగల్య సౌభాగ్యం పథకం ద్వారా స్వర్ణమాంగల్యం, ముహూర్త పట్టుచీర అందిస్తున్నది. ఇప్పుడు దాతల ద్వారా పేద గర్భిణి మహిళల ప్రసవం కోసం దరిదాపుగా యాభై వేల రూపాయలను అందించటానికి నిర్ణయం తీసుకున్నట్టు అధ్యక్షులు రఘుకుమార్ తెలియజేసారు.గత కొన్నేళ్ళుగా విద్య, వసతి , వివాహం , ఉద్యోగం , సంస్కృతి పథకాల ద్వారా సేవలందిస్తున్నది.

# జనని రజతోత్సవ సంచిక ఆవిష్కరణ




1993 లో ఆవిర్భవించిన జనని అధ్యక్షులు నిర్మలా పళనివేలు , ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్యల నిర్విరామ కృషి పట్టుదలతో తెలుగు కోసం పాటుపడుతోంది. రజతోత్సవ సందర్భంగా ఆడంబర ఉత్సవంగా కాకుండా నలుగురికి ఉపయోగపడే విధంగా పోపురి విశ్వనాథం, ఉప్పలదడియం వెంకటేశ్వరుల సహకారంతో అందంగా మందంగా(నాలుగు వందల పేజీలతో) ఒక చక్కని సంచికను ఆవిష్కరించింది.ఎన్నో వ్యయ ప్రయాసలను ఒడిదుడుకులను అధిగమించి ఆలస్యమైనా ఒక చక్కని ఆలోచన చేసినందుకు జనని నిర్వాహకులకు అభినందనలు.

# వేద విజ్ఞాన వేదిక



వేద విజ్ఞాన వేదిక, తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, విజయనగర సామ్రాజ్య స్వర్ణయుగకర్త శ్రీకృష్ణదేవరాయుల "రాయల రుతు వర్ణనలు" అంశంపై కాసల నాగభూషణం ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జె కె రెడ్డి ప్రార్థన , తరువాయి స్వాగతోపన్యాసం గావించిన కందనూరి మధు ఇది ధారావాహికలో 125 వ మాసమని సభికుల హర్షధ్వానాల మధ్య తెలియపరచారు. నాగభూషణంగారి ప్రసంగం ఆద్యంతం ఆయనకే తగిన బాణిలో చక్కగా సాగింది.వేద విజ్ఞాన వేదిక తరపున నాగభూషణమును ఘనంగా సత్కరించారు.

Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**June 2022**










# The One Stop solution for all your Printing Needs

## GOTETI GRAPHICS

64 (16), Thambiah Road, West Mambalam, Chennai - 600 033. INDIA

✆ : **098400 48941** E-mail : **gotetigraphics@gmail.com**

***Our print support creates a remarkable value in your business***